1 St Year
Happy Work Anniversary.

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
RNI : APTEL / 2023 / 89152

Good for Health
Best for Readers
THE POWER OF RK PEN

సంపుటి : 2 సంచిక : 257 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ గురువారం 21 జూలై 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 257 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Thursday 21 July 2025 PAGES : 8 PRICE : 3/-

# ఆవిష్కరణలకు వనరులు అడ్డంకి కాదు...

## వినూత్నమైన ఆలోచనలే ముఖ్యం

మంగళగిరిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం

ఏపీని ఇన్నోవేషన్ వ్యాలీ ఆఫ్ ఇండియాగా తీర్చిదిద్దుతామన్న లోకేష్

ప్రతి ఇంటికి ఒక పారిశ్రామికవేత్త ఉండాలన్నదే లక్ష్యమని స్పష్టీకరణ

ఆవిష్కర్తలకు అన్ని విధాలా అండగా ఉంటామని హామీ

రతన్ టాటా ఆదర్శాలకు ఈ హబ్ అంకితమని వెల్లడి

యువతకు మార్గనిర్దేశం చేయనున్న టాటా, అమర్ రాజా వంటి దిగ్గజాలు




2

## కీలక బిల్లులు లోక్‌సభ ముందుకు..



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఆగస్టు 18)
తీవ్రమైన నేరారోపణలతో అరెస్టయి వరుసగా 30 రోజులపాటు నిర్బంధంలో ఉంటే ప్రధాని, ముఖ్యమంత్రులు, మంత్రులను పదవి నుంచి తొలగించేందుకు వీలు కల్పించే మూడు బిల్లులను కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా నేడు లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ప్రతిపక్షాల నుంచి పెద్దఎత్తున నిరసన వ్యక్తమైంది. ప్రతిపాదిత బిల్లులు రాజ్యాంగం, సమాఖ్యవాదానికి వ్యతిరేకంగా ఉన్నట్లు ఆరోపించాయి. ఈ బిల్లులను హడావుడిగా తీసుకొచ్చారనే విమర్శలను అమిత్ షా తోసిపుచ్చారు. వాటిని సంయుక్త పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు పంపనున్నట్లు ప్రకటించారు. బిల్లులను ప్రవేశపెట్టిన సందర్భంలో లోక్‌సభలో అధికార, విపక్షాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కొంతమంది ప్రతిపక్ష ఎంపీలు బిల్లు ప్రతులను చించి విసిరారు. వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు చేశారు. గుజరాత్ హోంమంత్రిగా ఉన్న సమయంలో అమిత్ షా అరెస్టయిన అంశాన్ని కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ లేవనెత్తారు. దీన్ని అమిత్ షా ఖండిస్తూ.. అరెస్టుకు ముందే నైతిక కారణాలతో తాను రాజీనామా చేశానని, కోర్టు నిర్దోషిగా ప్రకటించాకే ప్రభుత్వంలో చేరానన్నారు. తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటున్నప్పటికీ.. రాజ్యాంగ పదవుల్లో కొనసాగడం తగదన్నారు. ఈ క్రమంలోనే ప్రతిపక్ష నిరసనల నడుమ సభ వాయిదా పడింది.

**లోక్‌సభ ముందుకు కీలక బిల్లు..**
**శశిథరూర్ కాంగ్రెస్ వ్యతిరేక బాణీ**

తీవ్రమైన నేరారోపణలతో అరెస్టయి వరసగా 30 రోజులపాటు నిర్బంధంలో ఉంటే ప్రధానినైనా, కేంద్ర మంత్రినైనా పదవి నుంచి తొలగించేందుకు ఈ బిల్లు వీలు కల్పిస్తుంది. -మిగతా 2లో

## కాంగ్రెస్‌కు శశిథరూర్ షాక్..
## మోదీ ప్రభుత్వ కీలక బిల్లుకు సమర్థన

పార్టీ, ఇండియా కూటమి వైఖరికి భిన్నంగా శశిథరూర్ అభిప్రాయం

30 రోజులు జైలులో ఉంటే మంత్రిగా ఎలా కొనసాగుతారని సూటి ప్రశ్న

బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపాలని సూచన

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఆగస్టు 18)
కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు, సీనియర్ ఎంపీ శశిథరూర్ మరోసారి పార్టీ వైఖరికి భిన్నంగా తన గళాన్ని వినిపించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న 'అనర్హత' బిల్లుల విషయంలో ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. కేంద్ర, రాష్ట్రాల్లోని ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, మంత్రులు ఎవరైనా వరుసగా 30 రోజుల పాటు కస్టడీలో -మిగతా 2లో



## రాష్ట్రంలో ఎవరూ సంతోషంగా లేరు

విశాఖ స్టీల్ ప్లాంట్ అప్పులు తీర్చి, అమ్మే కుట్ర చేస్తున్నారన్న బొత్స

'సూపర్ సిక్స్' పథకాల అమలులో స్పష్టత లేదని వ్యాఖ్య

అర్హులకు పింఛన్లు, సంక్షేమ పథకాలు అందట్లేదని ఆరోపణ

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 18)
విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఎందుకు మౌనంగా ఉన్నారని శాసనమండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. రాష్ట్రంలో పాలన పూర్తిగా గాడి తప్పిందని, ఏ వర్గం కూడా ప్రభుత్వ పనితీరుతో సంతోషంగా లేదని ఆయన విమర్శించారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే విషయంలో తమకు రెండు నాల్కల ధోరణి లేదని బొత్స స్పష్టం చేశారు. కేంద్రం ప్రకటించిన ప్యాకేజీతో ప్లాంట్ అప్పులు తీర్చిన తర్వాత దాన్ని ప్రైవేటుకు అప్పగించే కుట్ర జరుగుతోందని ఆయన ఆరోపించారు. ఢిల్లీ -మిగతా 2లో



## పిఠాపురం మహిళలకు పవన్ కల్యాణ్ శ్రావణ శుక్రవారం కానుక

10 వేల మందికి చీరలు, పసుపు, కుంకుమల పంపిణీకి ఏర్పాట్లు

పాదగయ క్షేత్రంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాల నిర్వహణ

ఆగస్టు 22న ఐదు విడతలుగా కార్యక్రమం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 18)
ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ తన నియోజకవర్గ మహిళలకు శ్రావణమాస కానుకను ప్రకటించారు. శ్రావణమాసంలో చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని, 10 వేల మంది మహిళలకు చీరలతో పాటు పసుపు, కుంకుమలను అందించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 22వ తేదీన పిఠాపురంలోని ప్రసిద్ధ శ్రీ పాదగయ క్షేత్రంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. -మిగతా 2లో

## రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు అదిరిపోయే ఆరంభం..
## గిన్నిస్ బుక్‌లోకెక్కిన ఆంధ్రప్రదేశ్

రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం రోజే ఏపీకి గిన్నిస్ వరల్డ్ రికార్డు

కేవలం 24 గంటల్లో 1,67,321 స్టార్టప్‌ల రిజిస్ట్రేషన్‌తో సరికొత్త చరిత్ర

సీఎం చంద్రబాబు, టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్ చేతుల మీదుగా హబ్ ప్రారంభం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 18)
ఆంధ్రప్రదేశ్ ఆవిష్కరణల రంగంలో సరికొత్త చరిత్ర సృష్టించింది. రాష్ట్రంలో యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన 'రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్' (ఆర్టీఐహెచ్) ప్రారంభోత్సవం రోజే అరుదైన ప్రపంచ రికార్డును సొంతం చేసుకుంది. కేవలం 24 గంటల వ్యవధిలో రాష్ట్రవ్యాప్తంగా ఏకంగా 1,67,321 ఇన్నోవేషన్, బిజినెస్ స్టార్టప్‌లు రిజిస్టర్ కావడం ద్వారా ఈ అసాధారణ ఘనత సాధ్యమైంది. ఈ రికార్డును గుర్తిస్తూ గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ ప్రతినిధులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు అధికారిక ధృవపత్రాన్ని అందజేశారు. ఈ అద్భుతమైన ఆరంభం, రాష్ట్రంలో స్టార్టప్‌ల పట్ల యువతలో ఉన్న ఆసక్తికి, ప్రభుత్వ ప్రోత్సాహానికి నిదర్శనంగా నిలిచింది.
బుధవారం నాడు మంగళగిరిలోని మయూరి టెక్ పార్కులో ఏర్పాటు చేసిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు, టాటా సన్స్ చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్‌తో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ఆవిష్కరణలకు ప్రధాన -మిగతా 2లో

## భారత్ విషయంలో అమెరికా తీరు అన్యాయం: రష్యా



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఆగస్టు 18)
తమ దేశం నుంచి చమురు కొనుగోలు అంశంలో భారత్‌పై అమెరికా వైఖరి అన్యాయంగా ఉందని రష్యా ఆరోపించింది. ఈమేరకు ఆ దేశ దౌత్యవేత్త రోమన్ బబుష్కిన్ పేర్కొన్నారు. భారత్-రష్యా మధ్య ఇంధన సహకారం భవిష్యత్తులోను కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రస్తుతం న్యూఢిల్లీ సవాళ్లతో -మిగతా 2లో

## ఢిల్లీ సీఎం రేఖా గుప్తాపై దాడి..

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 18)
ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా పై దాడి జరిగింది. సివిల్ లైన్స్‌లోని అధికారిక నివాసంలో 'జన్ సున్‌వాయ్' నిర్వహిస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు భాజపా వర్గాలు వెల్లడించాయి. 35 ఏళ్ల వయసున్న ఓ వ్యక్తి ఈ దాడికి పాల్పడినట్లు తెలిపాయి. తొలుత అతడు కొన్ని పేపర్లను సీఎంకు అందించిన తర్వాత ఈ దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ ఘటనను భాజపా ఢిల్లీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ్ ఖండించారు. పోలీసులు దీనిపై దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.



అసలేం జరిగిందంటే..!
ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు ఢిల్లీ సీఎం రేఖా గుప్తా తన అధికారిక నివాసంలో ప్రతివారం 'జన్ సున్‌వాయ్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ఓ యువకుడు కొన్ని పేపర్లను ముఖ్యమంత్రికి అందించాడు. అంతలోనే గట్టిగా అరుస్తూ సీఎంపై దాడి చేశాడు. దీంతో -మిగతా 2లో

## ఏపీలో ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చర్యలు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 18)
ఏపీలో ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. సచివాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో ఉద్యోగుల జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం కొనసాగుతోంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ భేటీకి 15 ఉద్యోగ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు హాజరయ్యారు. ఉద్యోగుల ఆర్థిక, ఆర్థికేతర సమస్యల పరిష్కారంపై చర్చిస్తున్నారు.

# ఆవిష్కరణలకు వనరులు అడ్డంకి కాదు...

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 18)

ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే సరికొత్త ఆవిష్కరణలకు చిరునామాగా, 'ఇన్నోవేషన్ వ్యాలీ ఆఫ్ ఇండియా'గా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. యువత తమ వినూత్న ఆలోచనలకు పదును పెడితే, వారికి అండగా నిలిచేందుకు ప్రభుత్వం, పారిశ్రామిక దిగ్గజాలు సిద్ధంగా ఉన్నాయని ఆయన భరోసా ఇచ్చారు. ఆవిష్కరణలకు వనరులు అడ్డంకి కాదు, వినూత్నమైన ఆలోచనలే ముఖ్యం... ప్రతి యువకుడు విద్యార్థి దశ నుంచే మెరుపులాంటి ఆలోచనలతో ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. మంగళగిరి సమీపంలోని ఎన్ హెచ్-16 పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన 'రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్' ప్రారంభోత్సవ కార్యక్రమంలో నారా లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర భవిష్యత్తుకు సంబంధించిన కీలకమైన దార్శనికతను ఆవిష్కరించారు.

రతన్ టాటా ఆశయాలకు అంకితం

ఈ ఇన్నోవేషన్ హబ్ కేవలం ఒక భవనం కాదని, రాష్ట్రంలోని లక్షలాది మంది యువత ఆశలకు, ఆకాంక్షలకు ప్రతిరూపమని మంత్రి లోకేశ్ అభివర్ణించారు. "భరతమాత ముద్దుబిడ్డ, అత్యున్నత నైతిక విలువలు కలిగిన మహోన్నత వ్యక్తి శ్రీ రతన్ టాటా జీ స్ఫూర్తితో ఈ కేంద్రాన్ని నెలకొల్పాం. ఆయన కన్నుమూసినప్పుడు మేం క్యాబినెట్ సమావేశంలో ఉన్నాం. ఆ మహనీయుడి సేవలకు గుర్తుగా, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలనే సంకల్పంతో ఈ హబ్‌ను ఆయన ఆదర్శాలకు అంకితం చేస్తున్నాం" అని లోకేశ్ భావోద్వేగంగా తెలిపారు.

ప్రతి ఇంటికి ఒక పారిశ్రామికవేత్త

ఈ సందర్భంగా నారా లోకేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయాలను వివరిస్తూ, గతంలో ప్రతి ఇంటికి ఒక ఐటీ నిపుణుడు ఉండాలని ఆయన ఆకాంక్షించారని, నేడు రాష్ట్రంలోని 1.3 కోట్ల కుటుంబాల్లో ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త తయారుకావాలని లక్ష్యంగా పెట్టుకున్నారని వెల్లడించారు. చంద్రబాబు కూడా ఒక విజయవంతమైన పారిశ్రామికవేత్త అని, హెరిటేజ్ సంస్థను ప్రారంభించడానికి ముందు ఆయన మూడుసార్లు విఫలమయ్యారని గుర్తుచేశారు.

"చిత్తూరు జిల్లా రైతులకు మేలు చేయాలన్న సంకల్పంతో ప్రారంభించిన హెరిటేజ్, నేడు 12 రాష్ట్రాల్లో రూ.5 వేల కోట్ల వ్యాపార సామ్రాజ్యంగా విస్తరించింది. వైఫల్యాలు ఎదురైనా పట్టుదల, నిబద్ధతతో పనిచేస్తే అద్భుతాలు సాధించవచ్చనడానికి ఇదే నిదర్శనం" అని అన్నారు. చంద్రబాబు పని రాక్షసుడని, ఉదయం 10 గంటలకు ఒక పని అప్పగిస్తే, 15 నిమిషాలకే దాని పురోగతి గురించి అడుగుతారని, ఆయనతో కలిసి పనిచేయడం కష్టమైనా రాష్ట్రానికి ఎంతో మేలు జరుగుతుందని లోకేశ్ వ్యాఖ్యానించారు.

ఆవిష్కర్తలకు పారిశ్రామిక దిగ్గజాల అండ

యువ ఆవిష్కర్తలకు కేవలం ప్రభుత్వమే కాకుండా, పారిశ్రామిక దిగ్గజాలు కూడా అండగా నిలిచేలా ఒక ప్రత్యేకమైన నమూనాను రూపొందించినట్లు మంత్రి తెలిపారు. అమర్ రాజా, గ్రీన్ కో, జిందాల్, అదానీ, టాటా గ్రూప్ వంటి సంస్థలు యువత ఆలోచనలకు మార్గనిర్దేశం చేసేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. "టాటా గ్రూప్ చైర్మన్ చంద్రశేఖరన్ గారు ఏపీ పెట్టుబడుల టాస్క్ ఫోర్స్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి మమ్మల్ని ముందుకు నడిపిస్తున్నందుకు ప్రత్యేక ధన్యవాదాలు" అని లోకేశ్ పేర్కొన్నారు. ఆవిష్కరణలంటే కేవలం ఐటీ రంగమే కాదని, గ్రామీణ స్థాయి నుంచి ప్రపంచ స్థాయి వరకు ఆరోగ్యం, బయో డిగ్రేడబుల్ ఉత్పత్తుల వంటి అన్ని రంగాల్లోనూ వినూత్న ఆవిష్కరణలకు అపార అవకాశాలున్నాయని ఆయన సూచించారు.

డబుల్ ఇంజన్ సర్కారుతో ప్రగతి

గత 14 నెలల కూటమి పాలనలో స్నేహపూర్వక పారిశ్రామిక విధానాలతో రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు ఆకర్షించగలిగామని మంత్రి లోకేశ్ తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'స్టార్టప్ ఇండియా', 'స్టాండప్ ఇండియా', 'మేకిన్ ఇండియా' వంటి పథకాల మద్దతుతో రాష్ట్రాన్ని తయారీ రంగ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. "ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడు డబుల్ ఇంజన్ సర్కారు చురుగ్గా పనిచేస్తోంది. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఏపీ త్వరలోనే భారతదేశ ఆవిష్కరణల కేంద్రంగా మారుతుందని నేను హామీ ఇస్తున్నాను" అని లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, టీజీ భరత్, టాటా గ్రూప్ చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్, భారత్ ఫోర్జ్ చైర్మన్ బాబా కళ్యాణి, అమర్ రాజా గ్రూప్ చైర్మన్ గల్లా జయదేవ్, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, ఐటీ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# కీలక బిల్లులు లోక్‌సభ ముందుకు..

తీవ్ర నేరారోపణకు గురై అరెస్టయినప్పుడు కేంద్ర మంత్రిని, రాష్ట్ర లేదా కేంద్రపాలిత ప్రాంత ముఖ్యమంత్రిన్మి రాష్ట్ర మంత్రిని పదవి నుంచి తొలగించేందుకూ అనుమతిస్తుందని అధికార వర్గాలు వెల్లడించాయి. కనీసం అయిదేళ్ల శిక్ష పడే నేరానికి పాల్పడి, అరెస్టయి, నెలరోజులు నిర్బంధంలో ఉంటే 31వ రోజున వారి పదవి పోయేలా నిబంధనను చేర్చారు. వారంతట వారు రాజీనామా చేయకపోయినా కొత్త నిబంధన ప్రకారం పదవిని కోల్పోతారు.

## మొదటిపేజీ తరువాయి

# పిఠాపురం మహిళలకు పవన్ కల్యాణ్ శ్రావణ శుక్రవారం కానుక

అక్కడి ఉమా కుక్కుటేశ్వరస్వామి, పురుహూతిక అమ్మవారి ఆలయ ప్రాంగణంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు జరపనున్నారు. ఈ వ్రతాల్లో పాల్గొనే మహిళలకు ఈ కానుకలను అందజేయనున్నారు. కార్యక్రమం సజావుగా సాగేందుకు, రద్దీని నియంత్రించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఐదు విడతలుగా వరలక్ష్మీ వ్రతాలను నిర్వహిస్తారు. ప్రతి విడతకూ అంబిక, భ్రమరాంబ, చాముండి, దుర్గ, ఈశ్వరి అని అమ్మవార్ల పేర్లతో నామకరణం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే మహిళల కోసం గురువారం నుంచే కూపన్ల పంపిణీ ప్రారంభం కానుంది. ప్రతి కూపన్‌పై నిర్దిష్ట సమయాన్ని ముద్రిస్తారు. మహిళలు తమకు కేటాయించిన సమయానికి ఆలయానికి చేరుకోవాలని నిర్వాహకులు సూచించారు.

మధ్యాహ్నం 1 గంట తర్వాత వచ్చే మహిళలకు కూడా కానుకలు అందజేస్తామని స్పష్టం చేశారు. ఈ బృహత్కార్యక్రమాన్ని దేవాలయ సిబ్బంది, పోలీసులు, జనసేన వాలంటీర్ల సమన్వయంతో పర్యవేక్షించనున్నారు.

# రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు అదిరిపోయే ఆరంభం..

కేంద్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఈ హబ్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. "రతన్ టాటా గారి నిరాడంబరత, దేశానికి ఆయన చేసిన సేవ అందరికీ ఆదర్శం. ఆయన ఆలోచనలను భవిష్యత్ తరాలకు అందించాలనే సదుద్దేశంతో, 'గివ్ బ్యాక్ టు ది సొసైటీ' అనే ఆయన విధానాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఈ ఇన్నోవేషన్ హబ్‌కు శ్రీకారం చుట్టాం" అని చంద్రబాబు వివరించారు. ఈ హబ్ ద్వారా యువతలోని వినూత్న ఆలోచనలను గుర్తించి, వాటిని విజయవంతమైన వ్యాపారాలుగా మార్చేందుకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

రాష్ట్రవ్యాప్తంగా విస్తరణ.. ఇంటికో పారిశ్రామికవేత్తే లక్ష్యం

ఈ ఇన్నోవేషన్ కేంద్రాలను కేవలం అమరావతికే పరిమితం చేయకుండా 'హబ్ అండ్ స్పోక్' మోడల్‌లో రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తున్నట్లు సీఎం తెలిపారు. అమరావతి ప్రధాన కేంద్రంగా పనిచేస్తుండగా, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, అనంతపురంలో అనుబంధ కేంద్రాలు పనిచేస్తాయని చెప్పారు. భవిష్యత్తులో రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లోనూ ఇన్నోవేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసి, స్థానిక యువతకు అవకాశాలు కల్పించాలనేది తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. "ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలనేదే నా నినాదం. ఈ లక్ష్య సాధనలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ కీలక పాత్ర పోషిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. సరైన ప్రభుత్వ విధానాలతో సంపద సృష్టించడం ద్వారానే సంక్షేమం సాధ్యమవుతుందని, గతంలో ఐటీ రంగాన్ని ప్రోత్సహించిన తరహాలోనే ఇప్పుడు స్టార్టప్‌లకు ఊతమిస్తున్నామని అన్నారు.

టెక్నాలజీతో అభివృద్ధి.. అమరావతిలో క్వాంటం వ్యాలీ

టెక్నాలజీ వల్ల ఉద్యోగాలు పోతాయన్న వాదనను తాను నమ్మనని, టెక్నాలజీ కొత్త అవకాశాలను సృష్టిస్తుందని చంద్రబాబు అన్నారు. వ్యవసాయం, విద్య, వైద్యం, రక్షణ వంటి అనేక రంగాల్లో ఆవిష్కరణలకు అపారమైన అవకాశాలున్నాయని యువతకు సూచించారు. "అమరావతి నగరాన్ని క్వాంటం కంప్యూటింగ్ హబ్‌గా అభివృద్ధి చేస్తాం. క్వాంటం వ్యాలీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటివి భవిష్యత్తులో విప్లవాత్మక మార్పులు తేబోతున్నాయి. ఈ అవకాశాలను అందిపుచ్చుకునేలా రాష్ట్రాన్ని సిద్ధం చేస్తున్నాం" అని తెలిపారు. ఒకవైపు సంపద సృష్టిస్తూ, మరోవైపు 'పీ4' (ప్రజా భాగస్వామ్యంతో పేదరికంపై పోరాటం) ద్వారా పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తామని, 'వెల్తీ, హెల్తీ, హ్యాపీ సొసైటీ'గా ఏపీని మారుస్తామని పునరుద్ఘాటించారు.

టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతతో అతి తక్కువ సమయంలోనే ఇన్నోవేషన్ హబ్‌కు రూపమిచ్చారని ప్రశంసించారు. స్టార్టప్‌లకు ఇదొక అద్భుతమైన అవకాశమని, ఆరోగ్యం నుంచి వ్యవసాయం వరకు అనేక రంగాల్లో వినూత్న పరిష్కారాలు కనుగొనేందుకు ఈ కేంద్రం వేదికగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రులు నారా లోకేశ్, నాదెండ్ల మనోహర్, టీజీ భరత్, భారత్ ఫోర్జ్ చైర్మన్ బాబా కల్యాణి, అమర్ రాజా బ్యాటరీస్ చైర్మన్ గల్లా జయదేవ్ తదితర పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు. అనంతరం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టార్టప్ కంపెనీల స్టాళ్లను ముఖ్యమంత్రి సందర్శించి, వారి ఉత్పత్తులను పరిశీలించారు.

# కాంగ్రెస్‌కు శశిథరూర్ షాక్.. మోదీ ప్రభుత్వ కీలక బిల్లుకు సమర్థన

ఉంటే వారి పదవిని రద్దు చేసే నిబంధన ఈ బిల్లుల సారాంశం.

ఈ బిల్లులపై 'ఇండియా' కూటమిలోని పార్టీలన్నీ ఏకతాటిపైకి వచ్చి నిరసన వ్యక్తం చేస్తుండగా, శశి థరూర్ మాత్రం ఇందుకు భిన్నంగా స్పందించారు. బుధవారం లోక్‌సభ వాయిదా పడిన తర్వాత ఆయన మాట్లాడుతూ, "30 రోజుల పాటు జైలులో ఉన్న వ్యక్తి మంత్రిగా ఎలా కొనసాగుతారు? ఇది చాలా సాధారణమైన విషయం. ఇందులో నాకు పెద్దగా తప్పేమీ కనిపించడం లేదు" అని వ్యాఖ్యానించారు. ఎవరైనా తప్పు చేస్తే మంత్రి పదవిలో ఉండకూడదన్నది చాలా తార్కికమైన విషయమని ఆయన అభిప్రాయపడ్డారు.

అయితే, తాను ఇంకా బిల్లును పూర్తిగా చదవలేదని, తన ఈ అభిప్రాయమే చివరిది కాదని శశిథరూర్ స్పష్టం చేశారు. ఈ బిల్లుపై ఉన్న సందేహాలను నివృత్తి చేసేందుకు, దానిపై లోతైన చర్చ జరిపేందుకు దీనిని జాయింట్ పార్లమెంటరీ కమిటీకి (జేపీసీకి) పంపాలని ఆయన సూచించారు. ఈ బిల్లును సెలక్ట్ కమిటీకి పంపిస్తామని అధికార వర్గాలు వెల్లడించడంపై కూడా శశిథరూర్ స్పందించారు. ఇది ఎంతో మంచి విషయమని ఆయన అన్నారు. ఇది మన ప్రజాస్వామ్యానికి మేలు చేస్తుందని భావిస్తున్నట్లు చెప్పారు.

# రాష్ట్రంలో ఎవరూ సంతోషంగా లేరు

పర్యటనల్లో చంద్రబాబు ఈ కీలక అంశంపై ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు.

అదేవిధంగా, ప్రభుత్వం ఘనంగా ప్రకటించిన 'సూపర్ సిక్స్' పథకాల అమలులో స్పష్టత కొరవడిందని బొత్స విమర్శించారు. సరైన కారణాలు లేకుండా అర్హులైన వితంతువులు, వికలాంగులకు పింఛన్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. 'తల్లికి వందనం' వంటి పథకాల్లోనూ కోతలు పెడుతున్నారని, ప్రజలను మోసం చేస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు.

# భారత్ విషయంలో అమెరికా తీరు అన్యాయం: రష్యా

కూడిన పరిస్థితిని ఎదుర్కొంటోందన్నారు. భారత్‌తో సంబంధాలపై పూర్తి విశ్వాసం ఉందని పేర్కొన్నారు. అమెరికా ఆర్థికవ్యవస్థలను ఆయుధంలా వాడుతోందని విమర్శించారు. వాస్తవానికి మిత్రులు ఎప్పుడూ ఆంక్షలు విధించరని వాషింగ్టన్‌ను దెప్పిపొడిచారు. రష్యా భవిష్యత్తులోను భారత్ అలాంటి చర్యలు తీసుకోదన్నారు. భారత్‌కు ఎటువంటి ఇబ్బందిలేకుండా చమురు సరఫరా చేసేందుకు మాస్కో ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటుచేసిందన్నారు. ప్రస్తుతం సగటున 5 శాతం డిస్కౌంట్‌తో భారత్ అవసరాల్లో 40శాతం సరఫరా చేస్తున్నామన్నారు. అమెరికా మార్కెట్లకు ఎగుమతి చేసేందుకు భారత్ ఇబ్బంది పడుతుంటే.. రష్యా మార్కెట్లు స్వాగతం పలుకుతాయని చెప్పారు.

భారత్ ఎదుర్కొంటున్న సవాళ్ల పరిష్కారంలో అండగా ఉండటానికి తమ దేశం కట్టుబడి ఉందని రోమన్ వెల్లడించారు. చిన్న, మాడ్యులర్ అణు రియాక్టర్లపై చర్చలు పురోగతిలో ఉన్నట్లు చెప్పారు. భారత్‌లో ఉత్పత్తులు చేయడానికి న్యూదిల్లీకి సరైన భాగస్వామి రష్యానే అని పేర్కొన్నారు. గతంలో బ్రహ్మోస్ క్షిపణుల తయారీని గుర్తుచేశారు. శక్తిమంతమైన జెట్ ఇంజిన్ల తయారీపైనా పనిచేస్తున్నట్లు చెప్పారు. భారత్ తమకు చాలా ముఖ్యమైన దేశమని.. అందుకే అధ్యక్షుడు పుతిన్ స్వల్ప వ్యవధిలోనే రెండుసార్లు ప్రధాని మోదీతో మాట్లాడారన్నారు. సమస్యల పరిష్కారంపై బీజింగ్-న్యూదిల్లీ కలిసి పని చేయడాన్ని స్వాగతించారు. చైనా మంత్రి వాంగ్‌యీ పర్యటన విజయవంతమైందన్నారు.

**ఆగని చమురు మంటలు: ట్రంప్ కార్యవర్గం పదేపదే టార్గెట్ భారత్..!**

ఇక రష్యాను శిక్షించేందుకు ఆంక్షలు విధించినవారే ఇప్పుడు ఆ ఫలితాలను అనుభవిస్తున్నారని రోమన్ చెప్పారు. ప్రస్తుతం ప్రపంచ రాజకీయాల్లో కుదుపులు నెలకొన్న నేపథ్యంలో వాటిని స్థిరీకరించే శక్తిగా బ్రిక్స్ ఉంటుందని రోమన్ వెల్లడించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై సుంకాలను రెట్టింపు చేసి 50శాతానికి చేర్చిన నేపథ్యంలో రష్యా నుంచి స్పందన వెలువడటం గమనార్హం. మరికొన్ని రోజుల్లో అవి పూర్తిస్థాయిలో అమల్లోకి రానున్నాయి.

**చమురు కొనుగోళ్ల పునరుద్ధరణ..**

రష్యా ఉత్పత్తి చేసే ఉరల్స్ చమురు కొనుగోళ్లను భారత్ రిఫైనరీలు పునరుద్ధరించాయి. ఐవోసీ, బీపీసీఎల్ తాజాగా సెప్టెంబర్, అక్టోబర్ నెలలో డెలివరీలకు ఆర్డర్లు పెట్టాయి. తాజాగా మాస్కో డిస్కౌంట్లను పెంచడంతో ఈ నిర్ణయం తీసుకొన్నట్లు తెలుస్తోంది. న్యూదిల్లీ నుంచి కొనుగోళ్లు పెరగడంతో.. చైనాకు సరఫరాలు తగ్గనున్నాయి. జులైలో డిస్కౌంట్లు తగ్గడంతో.. భారత సంస్థలు కొనుగోళ్లు నిలిపాయి. కానీ ఆ తర్వాత పరిణామాల్లో రాయితీ 3 డాలర్లకు పెరిగింది. తాజాగా ఆర్డర్లు పెట్టినట్లు తెలుస్తోంది.

# దిల్లీ సీఎం రేఖా గుప్తాపై దాడి..

వెంటనే అప్రమత్తమైన వ్యక్తిగత భద్రతా సిబ్బంది నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడిని రాజ్‌కోట్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు సమాచారం. ఊహించని పరిణామంతో ముఖ్యమంత్రి షాక్‌కు గురైనట్లు తెలుస్తోంది. ఆమెను వెంటనే వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి తరలించినట్లు తెలుస్తోంది.ముఖ్యమంత్రిపై దాడిని రాజకీయ పక్షాలు ఖండించాయి. దిల్లీ మంత్రి మంజీందర్ సింగ్ సిర్సా మాట్లాడుతూ.. దిల్లీ ప్రజల కోసం తీవ్రంగా శ్రమిస్తోన్న ముఖ్యమంత్రిపై దాడి చేయడం దారుణమన్నారు. ఇది ప్రత్యర్థుల కుట్ర కావచ్చని అనుమానం వ్యక్తంచేశారు. దీనిలో ఏదైనా రాజకీయ పార్టీ ఉందా? అన్న కోణంలోనూ దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందన్నారు.దిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత ఆతిశీ కూడా ఈ ఘటనను ఖండించారు. ప్రజాస్వామ్యంలో హింసకు చోటు లేదన్నారు. నిందితులపై దిల్లీ పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి క్షేమంగా ఉన్నారని భావిస్తున్నామన్నారు.

ఈ దాడిని ఖండించిన దిల్లీ కాంగ్రెస్.. దురదృష్టకరమైన ఘటన అని పేర్కొంది. ముఖ్యమంత్రికే రక్షణ లేకుంటే సాధారణ మహిళల పరిస్థితి ఏంటని దిల్లీ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్ ఆందోళన వ్యక్తంచేశారు.

# 9 మంది హెడ్ కానిస్టేబుళ్ళు ఎఎస్ఐ లుగా పదోన్నతి

# పదోన్నతితో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

## శాంతి భద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషించాలి

## ఎస్పీ ఏ ఆర్ దామోదర్




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 20)

జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో ఖాళీల ఆధారంగా 9 మంది హెడ్ కానిస్టేబుళ్ళకు ఎఎస్ఐ హోదాకు పదోన్నతి కల్పిస్తూ, జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ బుధవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో పదోన్నతి ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా పదోన్నతులు పొందిన వారిని జిల్లా ఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్‌శాఖలో విధులు నిర్వర్తిస్తూ పదోన్నతి పొందడం ఒక గౌరవకరం అయిన విషయమని, పదోన్నతి పొందిన మీరు మరింత నిబద్ధతతో, అంకితభావంతో విధులు నిర్వర్తించాలని, పోలీస్ స్టేషన్లను ఆశ్రయించే బాధితులకు అండగా నిలబడి, త్వరితగతిన న్యాయం అందించేందుకు నిరంతరం కృషి చేయాలన్నారు. పోలీస్ శాఖ ప్రతిష్ఠను మరింతగా పెంచేలా విధులు నిర్వర్తించాలని, విధి నిర్వహణలో శాఖాపరమైన సహకారం అందించడానికి ఎల్లవేళలా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. నూతనంగా పదోన్నతి పొందిన ఏఎస్ఐలు ప్రజలతో స్నేహపూర్వక వాతావరణాన్ని ఏర్పరచాలని, శాంతి భద్రతల పరిరక్షణ, నేరాలు నియంత్రణ, పాఠశాలలు మరియు కళాశాలల విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, లైంగిక వేధింపులు, పోక్సో చట్టాలపై, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నియమాలు, డయల్ 100, 112 సేవల గురించి విస్తృతంగా అవగాహన కల్పించటంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఈ పదోన్నతులు వారి బాధ్యతలను పెంచుతాయని, వాటిని సమర్థవంతంగా నిర్వర్తించి ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. పదోన్నతి పొందిన పోలీస్ సిబ్బంది జిల్లా ఎస్పీకి ప్రత్యేక హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పదోన్నతి పొందిన వారిలో ఐ సుభాన్ సాహిబ్ బాపట్ల జిల్లా, కె మురళీధర్ నెల్లూరు జిల్లా, ఎస్ ఆర్ ఖాసీం షరీఫ్, తాళ్లూరు, ఎస్‌కె జిల్లాసాహెబ్ బాపట్ల జిల్లా, ఐ వి శ్రీనివాసరావు, మార్కాపురం రూరల్, ఎస్ కె బాజీ బాబు, త్రిపురాంతకం, ఎస్ కె ప్రవీణ్ షా, ఒంగోలు, సిహెచ్ హెప్సి రాణి, ఒంగోలు, వి కోటేశ్వరరావు, బాపట్ల జిల్లా వారు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ రామ్మోహనరావు, డిపిఓ సిబ్బంది పాల్గొన్నారు.







# ఎదుటివారికి సాయం చేసే గుణం

## పిన్న వాయస్సు నుంచే అలవర్చుకోవాలి

## బండ్రెడ్డి రజని

(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఆగస్టు 20)

ముత్తాయిపాలెంలోని పల్లెపాలెం పోలేరమ్మ గుడి దగ్గర శ్రావణమాసం చివరి రోజుల సందర్భంగా బండ్రెడ్డి రజని పిల్లలకు ఎగ్జామ్ పాడ్స్, పెన్స్, ఫ్రూట్స్ అందించటం జరిగింది. అంతే కాకుండా ఆడపిల్లలకు జాకెట్ ముక్కలు అందించటం జరిగింది. అనంతరం రజని పిల్లలతో మాట్లాడుతూ అందరూ బాగా చదువు కోవాలి, అన్నిరంగాల్లో ముందుండాలి,క్రమశిక్షణ నేర్చుకోవాలని దైవ భక్తి కలిగి ఉండాలని, తోటివానికి సాయం చేసే గుణ్ణం పిన్నవాయస్సు నుండే అలవర్చుకోవాలి, ఎన్నటికీ తిరిగి రానిదే బాల్యం ఇప్పటినుండి మీరు నేర్చుకునే అలవాట్లు, మీరు చేసే పనులు జీవితాంతం గుర్తుంటాయని సమాజ సేవకురాలు రజని అన్నారు. పిల్లలందరు ఆట, పాటల్లో కూడా నైపుణ్యత సాధించాలని వారి కృషికి తల్లిదండ్రులు ఆయువు పోయాలని పిల్లల తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేసారు.



షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం



# జిల్లా జైలుకు నెల్లూరు కిలాడి లేడీ నిడిగుంట అరుణ

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 20)

రౌడీషీటర్ శ్రీకాంత్ ప్రియురాలు, లేడీ డాన్ నిడిగుంట అరుణకి న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో ఆమెను కావలి జైలులో ఉమెన్ కి స్పెషల్ సెల్ లేకపోవడంతో ఒంగోలు జైలుకి బుధవారం రాత్రి తరలించారు. మిగతా ముగ్గురిని జిల్లా జైలుకి తరలించారు. కోవూరులో ప్లాట్ యజమానిని బెదిరించిన (తరువాయి 4లో...)



# కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరాకు ప్రభుత్వ ప్రాధాన్యం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 20)

కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరాకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నందున సిబ్బంది ప్రవర్తన వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు రాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. విద్యుత్ శాఖ అధికారులతో బుధవారం తన క్యాంపు కార్యాలయంలో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వ్యవసాయ, పరిశ్రమలకు విద్యుత్ డిమాండ్ - సరఫరా, పీఎం సూర్యఘర్, ఆర్‌డిఎస్‌ఎస్ పనులు, స్మార్ట్ మీటర్లు, నూతన సబ్ స్టేషన్ల నిర్మాణ పనుల్లో పురోగతి, సిబ్బంది - ఖాళీలు, గ్రీవెన్స్ అర్జీల పరిష్కారం, ఐవిఆర్‌ఎస్ సర్వేలో ప్రజల నుంచి వచ్చిన ఫీడ్ బ్యాక్, తదితర అంశాలపై ఆమె సమీక్షించారు. ఆయా అంశాలపై ఏపీ సిపిడిసిఎల్ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు ఈ సందర్భంగా కలెక్టరుకు వివరించారు. ఖాళీగా ఉన్న ఏఈఈ పోస్టులను భర్తీ చేయటానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సిబ్బందితో నిర్వహణ విధులు చేస్తున్నామన్నారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ పనిచేసే ప్రాంతంలోనే సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీని ద్వారా సేవలలో నాణ్యత పెరుగుతుందని, ప్రజలలోనూ సానుకూల దృక్పథం ఏర్పడుతుందని చెప్పారు. ప్రధానంగా ఐవిఆర్‌ఎస్ సర్వేలో విద్యుత్తుశాఖ సేవలపై ప్రజల్లో సంతృప్తి స్థాయి పెరిగేలా చూడాలన్నారు. దోర్నాల, మార్కాపురం, ముండ్లమూరు, చీమకుర్తి, పెద్దారవీడు, ఎర్రగొండపాలెం, సంతనూతలపాడు, పామూరు, మద్దిపాడు మండలాల పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఆర్.డి.ఎస్.ఎస్ కార్యక్రమంలో భాగంగా గ్రామాలకు కొత్తగా వేస్తున్న 3 ఫేస్ విద్యుత్ లైన్ల పనులు కూడా వేగవంతం చేయాలని కలెక్టర్ చెప్పారు. ఈ సమావేశంలో విద్యుత్‌శాఖ ఈఈలు, డిఈఈలు, నెడ్ క్యాప్ అధికారులు పాల్గొన్నారు.



# బాలిక కిడ్నాప్ కేసులో ముగ్గురు ముద్దాయిల అరెస్ట్

(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, ఆగస్టు 20)

రాచర్ల మండలంలోని అనుములవీడు గ్రామంలో చోటుచేసుకున్న కిడ్నాప్ ఘటనతో ప్రాంతమంతా ఒక్కసారిగా కలకలమైంది. ఓ పది వ తరగతి చదువుతున్న బాలికను దుండగులు తెల్లవారుజామునే స్కూల్ సమీపంలో కిడ్నాప్ చేయడం తల్లిదండ్రులు, గ్రామస్తులు, బంధువుల్లో తీవ్ర ఆందోళన కలిగించింది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు కేవలం గంట వ్యవధిలోనే బాలికను సురక్షితంగా గుర్తించి, నిందితులను పట్టుకోవడంలో విజయవంతమయ్యారు. కేసు వివరాలను






బుధవారం మార్కాపురం డిఎస్పీ యు నాగరాజు గిద్దలూరు రూరల్ సర్కిల్ కార్యాలయంలో మీడియా సమావేశంలో వెల్లడించారు.

**స్కూల్‌కి వెళ్తున్న బాలికను కిడ్నాప్**

ఆగస్టు 12వ తేదీ ఉదయం ఎనిమిది గంటల సమయంలో అనుములవీడు గ్రామానికి చెందిన మూడమంచు పాపయ్య కూతురు స్కూల్‌కి వెళ్తుండగా దుండగులు కారులో ఎక్కించుకొని తీసుకెళ్లారు. ముందుగానే టయోటా ఎటియాస్ కారును అద్దెకు తీసుకున్న నిందితులు, బాధితురాలిని వేగంగా హైవే దారిలో తరలించారు. ఈ దృశ్యాన్ని గమనించిన గ్రామస్తులు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

**తక్షణమే పోలీసుల వద్ద ఫిర్యాదు**

కూతురు కిడ్నాప్ అయిందని గ్రహించిన తండ్రి పాపయ్య రాచర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో జిల్లా ఎస్పీ ఏ.ఆర్. దామోదర్ ఆదేశాల మేరకు పోలీసులు చురుకుగా కదిలారు. గిద్దలూరు, మార్కాపురం, నంద్యాల, (తరువాయి 4లో...)

# అట్టహాసంగా రైతుల కృతజ్ఞతా ర్యాలీ

## 300 ట్రాక్టర్లతో జై చంద్రన్న అన్న రైతన్నలు

## ట్రాక్టర్ నడుపుతూ రైతులను ఉత్సాహపరచిన ఎమ్మెల్యే దామచర్ల



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 20)

అన్నదాత సుఖీభవ అంటూ చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రైతాంగాన్ని ఆశీర్వదించింది. గత వైసిపి ప్రభుత్వ హయంలో దగా పడిన రైతులకు నేనున్నానంటూ చంద్రబాబు అండగా నిలిచారు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ కింద రైతాంగానికి ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకం కింద రైతు ఖాతాల్లో పెద్ద మొత్తంలో నగదు జమ చేశారు. ఈ నేపథ్యంలో ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రైతులు స్పందించి సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియచేస్తూ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఒంగోలు నగరం, ఒంగోలు రూరల్ మండలం, కొత్తపట్నం మండలాల నుండి 300కు పైగా ట్రాక్టర్లతో రైతులు విజయోత్సవ ర్యాలీ చేపట్టారు. ర్యాలీ అగ్రభాగంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు జనసేన జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, బిజెపి జిల్లా అధ్యక్షుడు సెగం శ్రీనివాసరావు లను ఇరువైపులా కూర్చోపెట్టుకొని ట్రాక్టర్ నడుపుతూ రైతులను ఉత్సాహపరిచారు. కొప్పోలు నుండి కొత్తపట్నం వరకు ట్రాక్టర్లు ఒకదాని వెంట మరొకటి కదులుతూ చూపరులను కనువిందు చేశాయి. కొప్పోలు నుండి ప్రారంభమైన విజయోత్సవ ర్యాలీకి అడుగడుగునా ప్రజలు నీరాజనం పలికారు. కొప్పోలు మెయిన్ రోడ్డుకు ట్రాక్టర్ ర్యాలీ చేరుకోగానే అక్కడి ప్రజలు క్రేన్ సాయంతో దామచర్లకు గజమాల వేసి ఘన స్వాగతం పలికారు. ప్రజలు రోడ్లపైకి వచ్చి స్వాగతం పలికారు. అక్కడ నుండి అల్లూరు చేరుకోగానే అక్కడి మహిళలు గుమ్మడి కాయతో దిష్టి తీశారు. హారతులతో ఘన స్వాగతం పలికారు. కొత్తపట్నంలోని సభా స్థలికి ట్రాక్టర్లు చేరగానే అక్కడి రైతులు, తెలుగుదేశం పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ అఖండ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పిడిసిసి బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, ఒంగోలు వ్యవసాయ (తరువాయి 4లో...)



# అటవీ ఉద్యోగుల పై ఎమ్మెల్యే వీరంగం

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, ఆగస్టు 20)

శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, ఆయన అనుచరులు, విధులు నిర్వహిస్తున్న అటవీశాఖ ఉద్యోగులను కిడ్నాప్ చేసి, వాహనంలో బంధించి తీవ్రంగా భౌతిక దాడి చేశారు. మంగళవారం రాత్రి శ్రీశైలం శిఖరం చెక్ పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న ఉప అటవీ క్షేత్రాధికారి, ఇద్దరు బీట్ అధికారులు, ఇతర సిబ్బంది పై ఎమ్మెల్యే దౌర్జన్యానికి పాల్పడిన సంఘటన చోటు చేసుకుంది.



అసభ్య పదజాలం ఉపయోగిస్తూ, వాకీటాకీలు, సెల్‌ఫోన్లు, నగదు, ఇతర వస్తువులను దోచుకున్నారు. ప్రభుత్వ వాహనమైన అటవీక్షేత్రధికారి కారులోనే వారిని బంధించి శ్రీశైలం సున్నిపెంట రోడ్లన్ని తిప్పుకంటు దాడి చేశారు. అనంతరం గెస్ట్ హౌస్‌లో బంధించి చిత్రహింసలకు గురి చేశారు. రాత్రి రెండు గంటలకు వదిలి పెట్టారు. దాడికి గురైన వారంతా ఎస్సీ,ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందినవారే. ఇప్పటికే సిబ్బంది కొరతతో ఇబ్బందులు పడుతున్న అటవీ ఉద్యోగులు, ఇలాంటి భౌతిక దాడుల మధ్య విధులు నిర్వర్తించడం సాధ్యం కాదని ఆవేదన చెందుతున్నాము.దరిమిలా ఈ సంఘటనపై అటవీ ఉద్యోగ సంఘాలు, చెంచు గిరిజన సంఘాలము తీవ్రంగా ఖండిస్తున్నాము. శ్రీయుత ఉప ముఖ్యమంత్రి, అటవీశాఖ మంత్రి పవన్ కల్యాణ్ గారు వెంటనే స్పందించి దాడి జరిగిన వారికి న్యాయం డిమాండ్ చేస్తున్నాము. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, బుడ్డా రాజశేఖర రెడ్డిని పార్టీ నుండి సస్పెండ్ చేయాలని కోరారు. ఇలాంటి భౌతిక దాడులు చేసి, దూషించి, దుర్భాషలాడడం ప్రజాప్రాతినిధ్యానికి ఒక చేరగని మచ్చ. అంటువంటి వారు ఎమ్మెల్యేగా ఉండటానికి అనర్హులు. కావున శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి వెంటనే రాజీనామా చేయాలని, రాజీనామ చేయకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని అటవి శాఖ అధికారులు హెచ్చరించారు.

# సూర్యలంకలో మూడు రోజుల బీచ్ ఫెస్టివల్

## సెప్టెంబర్26, 27, 28 తేదీల్లో సాంస్కృతిక, క్రీడా, వినోద కార్యక్రమాలు

## సెప్టెంబర్ 27న సీఎం చంద్రబాబు నాయుడు రాక

## రూ.97 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, ఆగస్టు 20)

ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా బాపట్ల జిల్లాలోని సూర్యలంక బీచ్ సెప్టెంబర్ 26, 27, 28 తేదీల్లో మూడు రోజుల పాటు బీచ్ ఫెస్టివల్‌కు వేదిక కానుంది. ఈ ఏర్పాట్లపై బుధవారం కలెక్టర్ జె. వెంకట మురళీ సమీక్ష నిర్వహించారు. పర్యాటక, సాంస్కృతిక, వినోద అంశాలను జోడించి జిల్లా ప్రత్యేకతను చాటేలా ఈ వేడుకలు ఉండాలని ఆయన సూచించారు. మూడు రోజుల పాటు సాంస్కృతిక ప్రదర్శనలు, బీచ్ క్రీడలు, సంగీత నృత్య వినోదం, ఫుడ్ ఫెస్టివల్ వంటి కార్యక్రమాలు సందర్శకులను అలరించనున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా సెప్టెంబర్ 27న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూర్యలంక బీచ్‌కు రానున్నారు. అదే రోజు రూ.97 కోట్లతో చేపట్టనున్న సూర్యలంక అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే సూర్యలంక జాతీయ, అంతర్జాతీయ పర్యాటక పటంలో నిలిచిపోతుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. సమీక్షా సమావేశంలో టూరిజం రీజనల్ డైరెక్టర్ లక్ష్మీ ప్రసన్న, ఇన్‌ఛార్జ్ జెసి గంగాధర్ గౌడ్, ఆర్డీవో గ్లోరియ, డిప్యూటీ కలెక్టర్ నాగిరెడ్డి, డిఆర్డిఏ పిడి శ్రీనివాసరావు, ఏవో మల్లికార్జున,మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి మిగతా అధికారులు పాల్గొన్నారు.

## పనుల్లో నాణ్యత ముఖ్యం
## జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 20)
నీటి కాలువల్లో పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ పనుల్లో నాణ్యత ముఖ్యమని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. ఇరిగేషన్ అధికారులతో బుధవారం తన క్యాంపు కార్యాలయంలో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లాలో వివిధ నీటి కాలువల్లో జరుగుతున్న ఈ పనులలో పురోగతిపై ఆమె సమీక్షించారు. నాగార్జునసాగర్, రామతీర్థం, మోపాడు, కంభం చెరువుల నుంచి నీళ్లు సరఫరా అయ్యే కాలువల్లో చేపట్టిన పనుల పురోగతిని ఇరిగేషన్ ఎస్. ఈ. వరలక్ష్మి ఈ సందర్భంగా కలెక్టర్‌కు వివరించారు. ఎస్‌డిఎంఎఫ్ పనులను టెండర్ల ద్వారా చేపట్టామన్నారు. రూ.10 లక్షల లోపు విలువైన పనులైతే ఆయా సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టినట్లు తెలిపారు. కాగా ఈ పనులను సకాలంలో పూర్తి చేయడంతో పాటు నాణ్యత కూడా అత్యంత కీలకమని కలెక్టర్ అన్నారు. ఈ దిశగా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి చెరువులను కూడా పూర్తిస్థాయిలో నింపాలన్నారు. భూగర్భ నీటిమట్టం పెంచేందుకు ఆయా ప్రాంతాలను బట్టి నీటి సంరక్షణ నిర్మాణాలు చేపట్టేందుకు ప్రతిపాదనలను కూడా రూపొందించాలని చెప్పారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఈఈలు, భూగర్భ నీటివనరుల శాఖ అధికారులు పాల్గొన్నారు.

## ప్రతి రైతు పంట నమోదు చేసుకోవాలి



(షణ్ముఖ వెలుగు, కంభం, ఆగస్టు 20)
కంభం పట్టణ, పరిసర ప్రాంత రైతులకు అగ్రికల్చరల్ అసిస్టెంట్ అధికారి ఖాదర్ బాషా తగు సలహాలు సూచనలు ఇచ్చారు. ఇందులో భాగంగా అగ్రికల్చరల్ అసిస్టెంట్ ఖాదర్ భాష మాట్లాడుతూ ప్రతి రైతు అనగా సాగు చేసుకునేవాళ్లు కౌలుకు తీసుకున్న వాళ్లు ప్రతి ఒక్కరూ ఖరీఫ్ సీజన్ అయినందున తప్పకుండా పంట నమోదు చేసుకోవాలని పంట నమోదు చేసుకోవడం వలన అధిక వర్షాల కారణంగా మీ పొలాలు పంటలు కూలిపోయిన దెబ్బతిన్న ఇన్సూరెన్స్ నష్టపరిహారం ఇవ్వడం జరుగుతుందని అరటి, పసుపు, వరి, అన్ని రకాల కూరగాయలు మొదలగు సంబంధించిన పంట పొలాల రైతులు తప్పకుండా పంట నమోదు చేసుకోవాలని పట్టణమోదు చేసుకున్న రైతులకు ఇన్సూరెన్స్ జీరో పర్సంట్ వడ్డీ తో పంట రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. కావున ప్రతి ఒక్క రైతు తప్పకుండా పంట నమోదు చేసుకోవాలని రైతులను కోరారు.

## పాఠశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ టాబ్లెట్స్ పంపిణీ



(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఆగస్టు 20)
జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం బాపట్లలో బుధవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగమైన మాపప్ డే సందర్భంగా బాపట్ల మున్సిపల్ హై స్కూల్ నందు ఆర్ బి ఎస్ కే పి ఓ డాక్టర్ లలిత రాజేశ్వరి ఆధ్వర్యంలో 12. 8. 2025 తేదీన ఆల్బెండజోల్ మాత్రలు మింగని విద్యార్థిని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ లలితరాజేశ్వరి మాట్లాడుతూ నులిపురుగులు వల్ల పిల్లలలో ఎదుగుదల సరిగా ఉండదని, ఈ ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవడం వల్ల రక్తహీనతను నివారించవచ్చన్నారు. అలాగే అపరిశుభ్రమైన చేతులతో మనము ఏదైనా తిన్నప్పుడు నులిపురుగులు చేరతాయని, కాబట్టి ప్రతి ఒక్కరు తప్పనిసరిగా వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. ఏదైనా తినేటప్పుడు తిన్న తర్వాత తప్పనిసరిగా చేతులను శుభ్రంగా కడుకోవాలని, ప్రతి ఆరు నెలలకు ఒకసారి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాలు ,కళాశాల యందు ఆల్బెండజోల్ మాత్రలు మింగించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మౌనిక, స్కూలు ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, డిప్యూటీ డెమో బి మరియమ్మ, సి హెచ్ ఓ నాగేశ్వరరావు, ఆర్ బి ఎస్‌కేడిసి కోట బాబు, హెచ్ వి సుధారాణి ,ఏ ఎన్ ఎం రూతు, ఆశాలు పాల్గొన్నారు.



## అట్టహాసంగా రైతుల కృతజ్ఞతా ర్యాలీ

మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ కామేపల్లి శ్రీనివాసరావు, టీడీపి నగర అధ్యక్షుడు బండారు మదన్, ప్రధాన కార్యదర్శి బొడ్డపాటి వెంకట్, నాయకులు కొఠారి నాగేశ్వరరావు, వెంకటేశ్వరరెడ్డి, పల్లపోతు వెంకటేశ్వర్లు, కొమ్మూరి రవిచంద్ర, తెలుగు మహిళా నాయకురాళ్లు రావుల పద్మజ, నాళం నరసమ్మ, బిజెపి నాయకురాళ్ళు రమాదేవి, అపర్ణ, రాధాకృష్ణ, రాజేష్ వర్మ, టీడీపీ ఒంగోలు మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు, కొత్తపట్నం మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.





## బాలిక కిడ్నాప్ కేసులోముగ్గురు ముద్దాయిల అరెస్ట్

పల్నాడు, కడప జిల్లాలకు సమాచారం అందించి అన్ని చోట్ల తనిఖీలు చేపట్టారు.

**భయపడి వదిలేసిన నిందితులు :** పోలీసులు గాలింపు ముమ్మరం చేయడంతో భయపడిన నిందితులు దేవరాజుగుట్ట వద్ద బాలికను వదిలిపెట్టి పారిపోయారు. అయితే, పారిపోవడానికి ముందు బాలిక చేతిలోని బంగారు ఉంగరాన్ని బలవంతంగా తీసుకెళ్లినట్టు తేలింది.

**ముగ్గురు ముద్దాయిల అరెస్ట్**

ప్రత్యేక బృందాలు గిద్దలూరు పరిసరాల్లో గాలింపు జరిపి నిందితులను అదుపులోకి తీసుకున్నాయి. అరెస్ట్ అయినవారు గోతం ప్రవీణ్ కుమార్ , గోతం శివాజీ , చెన్నమాధవుని శరత్ రాజులుగా పోలీసులు గుర్తించారు. విచారణలో బాలికను కిడ్నాప్ చేసి ఆభరణాలు దోచుకున్నట్టు అంగీకరించారు.

**పోలీసుల వేగవంతమైన చర్యలు :** మార్కాపురం డిఎస్పీ యు. నాగరాజు పర్యవేక్షణలో గిద్దలూరు రూరల్ సీఐ జై రామకోటయ్య, రాచర్ల ఎస్సై కోటేశ్వరరావు, సిబ్బంది క్షణక్షణం సమన్వయం చేసుకుంటూ ఆపరేషన్ జరిపారు. కారు, సెల్‌ఫోన్లు, నేరానికి ఉపయోగించిన వస్తువులు స్వాధీనం చేసుకున్నారు.

**ఎస్పీ ప్రశంసలు :** జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ ఈ కేసులో పోలీసుల వేగవంతమైన చర్యలను ప్రశంసించారు. ప్రజల భద్రత కోసం పోలీసులు ఎప్పుడూ అప్రమత్తంగా ఉంటారని, ఇలాంటి నేరాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**ఊపిరిపీల్చుకున్న గ్రామం :** బాలిక సురక్షితంగా ఇంటికి చేరడంతో తల్లిదండ్రులు పోలీసులకు కన్నీటి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామమంతా ఊపిరి పీల్చుకుంది. "పోలీసులు సమయానికి స్పందించకపోతే పరిస్థితి వేరేగా ఉండేది. మా చిన్నారిని రక్షించినందుకు వారికి రుణపడి ఉంటాం" అని గ్రామస్తులు ప్రశంసలు కురిపించారు.

## జిల్లా జైలుకు నెల్లూరు కిలాడి లేడీ నిడిగుంట అరుణ

కేసులో పోలీసులు అరుణను అరెస్టు చేశారు. నాలుగు రోజుల క్రితం సీఐకి ఫోన్ చేసి ఆమె బెదిరించారు. హోంశాఖ కార్యాలయం నుంచి ఫోన్ చేస్తున్నామంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ కేసులో అరుణతో పాటు మరో ముగ్గురిని నిందితులుగా చేర్చారు. మునగ వెంకట మురళీ, కృష్ణమోహన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏ 1గా అరుణ, ఏ 2గా పి వేణు, ఏ 3గా అంకెం రాజా, ఏ 4గా సీరం ఎలీశాను నిందితులుగా పేర్కొన్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో శ్రీకాంత్ సహకారంతో పలు నేరాలు, సెటిల్మెంట్లు చేసినట్టు అరుణ పై ఆరోపణలున్నాయి.

## ఏపీ రాజధాని అమరావతి పై వైసీపీ నాయకుల తప్పుడు ప్రచారం దుర్మార్గం

### యాగంటి మల్లికార్జునరావు



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, ఆగస్టు 20)
రాష్ట్రంలో వర్షాలు పడితే నీరు పారక జగన్మోహన్ రెడ్డి మందు పారుద అని వైసీపీ పార్టీ నాయకులను యాగంటి మల్లికార్జున రావు ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ఇటీవల వర్షాలకు నీటమునిగిందని వైసీపీ నాయకులతో ప్రతిపక్ష నేత వైయస్ జగన్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేపించటం దుర్మార్గమని మాచర్ల మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జున రావు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యాగంటి మాట్లాడుతూ అమరావతి ప్రాంతమంతా నీటమునిగిందంటూ చేస్తున్న వైసీపీ నాయకుల ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. నాడు జగన్ అసెంబ్లీ సాక్షిగా రాజధానిగా అమరావతికి కట్టుబడి ఉన్నానంటూ మాట్లాడిన మాటలను గుర్తు చేశారు. మాయ మాటలతో నాడు అధికారాన్ని చేపట్టిన జగన్ రాష్ట్రాన్ని అంధకారంగా మార్చాడన్నారు. జగన్ చెప్పేదొకటి చేసేది మరొకటన్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో రూ.50 వేల కోట్లతో రాజధాని అమరావతి నిర్మాణ పనులు ప్రారంభించారని, పనులు ప్రారంభంలోనే ఎలా అవినీతి జరిగిందో వైసిపి నాయకులు సమాధానం చెప్పాలన్నారు. ఐదేళ్లు జగన్ పాలనలో అవినీతి రాజ్యమేలిందని, చివరకు 11సీట్లకే పరిమితం చేసినా జగన్ రెడ్డి కు బుద్ధి రాలేదన్నారు. ఒంటిమిట్ట, పులివెందుల జడ్పిటిసి ఎన్నికలలో డిపాజిట్లు కోల్పోయినా వైసీపీ నాయకుల వైఖరి మారలేదన్నారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం సస్యశ్యామలంగా, అభివృద్ధి బాటలో పరుగులు పెడుతుందని అది చూసి ఓర్వలేకనే వైసీపీ నాయకులు కుట్ర పూరిత రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలుపరుస్తూ ప్రజాదరణ పొందుతున్న కూటమి ప్రభుత్వంపై వైసిపి నాయకుల విష ప్రచారంలో అర్థం లేదన్నారు.

సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయి.

అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ పథకం అందించి అన్నదాతలకు అండగా నిలిచిన సీఎం చంద్రబాబు కి, కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ మాచర్ల లో 500 ట్రాక్టర్లతో భారీ ర్యాలీ నిర్వహించి స్టేట్లో నెంబర్ వన్‌గా చేశారు. మా ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అని యాగంటి వెల్లడించారు. దమ్ము ధైర్యం ఉంటే రాజకీయంగా రండి, పోరాటం చేద్దాం. నీలి మీడియా, కూలి మీడియాతో ఈ ఫేక్ ప్రచారాలు ఎందుకు జగన్మోహన్‌రెడ్డిని తీవ్రంగా హెచ్చరించారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమం అందిస్తున్నాం. సంపద సృష్టించి పేదలకు ఇచ్చే ప్రభుత్వం నారా చంద్రబాబు ప్రభుత్వం అని వెల్లడించారు.కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో అభివృద్ధి –సంక్షేమంలో ఏపీ దూసుకుపోతోంది. ఇది చూసి ఓర్వలేని వైసీపీ సోషల్ మీడియా, కిరాయి మూకలతో రాష్ట్రంపై విష ప్రచారం చిమ్ముతోంది. ఫేక్ న్యూస్‌తో ప్రజలను భయభ్రాంతులకు గురిచేయాలని వైసీపీ సైకోలు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. వైసీపీ ఫేక్ ప్రచారంపై సీఎం చాలా సీరియస్‌గా ఉన్నారు. అని ఫేక్, అవాస్తవాలు ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారన్నారు. ఆంధ్రప్రదేశ్ బ్రాండ్‌ను దెబ్బతీయాలని చూస్తే ఎంతటి వారినైనా వదిలి పెట్టే ప్రసక్తి లేదని హెచ్చరించారు. రాష్ట్రంలో ఇప్పటికీ కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులు వైసిపి మాయలోనే ఉన్నారని, దానికి ఉదాహరణగా తిరుపతి కమర్షియల్ టాక్స్ అధికారి చంద్రబోస్ కేంద్రం, కూటమి ప్రభుత్వంపై సోషల్ మీడియాలో విద్వేషకర ప్రచారానికి పాల్పడుతున్నాడని, ఆయనపై దేశద్రోహం కేసులు నమోదు చేయాలన్నారు. జగన్ 2019లో అధికారం చేపట్టిన జగన్ రాష్ట్రాన్ని వల్లకాడుగా మార్చిన సంగతి రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని, తిరిగి తాము అధికారంలోకి వస్తామంటూ జగన్ మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. ఇప్పటికైనా జగన్, ఆయన బృందం వైఖరి మార్చుకోవాలని, లేకపోతే రానున్న ఎన్నికల్లో ఆ 11 సీట్లు కూడా రావటం కష్టమేనన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ప్రసాద్, మస్తాన్, బ్రహ్మం, తిక్క కొండలు, బ్రహ్మం, ఆంజనేయులు,కృష్ణ, దుర్గారావు, రఫీ, పాల్గొన్నారు.

## శ్రీకృష్ణ యాదవ ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేత





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 20)
శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా శ్రీకృష్ణ యాదవ ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో కార్యక్రమ నిర్వాహకులు కుట్టుబోయిన కోటి యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు ఫ్యాట్స్ బుక్స్ జామెంట్రీ బాక్స్ విద్యా సామగ్రి అందజేశారు, ఒంగోలులోని రాంనగర్ లోని మున్సిపల్ హైస్కూల్, కోర్ట్ సెంటర్లోని మున్సిపల్ గర్ల్స్ హై స్కూల్ ఆవరణంలో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని , విద్యార్థులకు యాదవ సంఘ ప్రముఖులచే పాఠ్యపుస్తకాలతో పాటు విద్యా సామగ్రి అందించారు,గత మూడు సంవత్సరాలుగా శ్రీ కృష్ణ యాదవ్ ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందించడం జరుగుతుందని నిర్వాహకులు తెలియజేశారు. రానున్న రోజుల్లో ఇటువంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని అన్నారు,ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయురాలు టీచింగ్, మోరుబోయిన సురేష్, తేలుకుర్తి మల్లికార్జున్, తుమ్మకూరు సాయి, అరవ శ్రీనివాసరావు, కుట్టు బోయిన వెంకటసుబ్బయ్య (చిన్ని), తుమ్మకూరి హనుమంతరావు (దొర), తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జరిగిన దివంగత మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ జయంతి

## రాజీవ్ గాంధీ విగ్రహానికి భూమి పూజ



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 20)

భారత దేశ మాజీ ప్రధాని మంత్రి, భారత దేశాన్ని సాంకేతికంగా, ఐటీ రంగంలో ముందుకు నడిపించిన ముందు చూపు కలిగిన, ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన గొప్ప నాయకుడు రాజీవ్ గాంధీ. ఆయన జయంతి సందర్భంగా ఒంగోలు పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్‌లో నూతనంగా నిర్మాణం చేయనున్న విగ్రహానికి భూమి పూజ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు షేక్ సైదా మాట్లాడుతూ ప్రజాస్వామ్య ప్రక్రియలో యువకులు పాల్గొనే విధంగా 18 సంవత్సరాలకే ఓటు హక్కు ఇచ్చిన ముందుచూపు కలిగిన నాయకుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. ప్రపంచ నాయకులు సైతం గౌరవించే విధంగా దౌత్య సంబంధాలు, విదేశాంగ విధానంతో భారత దేశ కీర్తి ప్రతిష్ఠలు పెంచారు అని అన్నారు. పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీపతి ప్రకాశం మాట్లాడుతూ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహ ఏర్పాటుకు అందరూ కలిసి రావాలని అన్నారు. బడుగుబలహీన వర్గాల ఉన్నతికి రాజీవ్ గాంధీ ఎంతో కృషి చేశారని అన్నారు. ఈ



కార్యక్రమంలో రాష్ట్ర కేసీసీ చైర్మన్ , దర్శి నియోజకవర్గ కోఆర్డినేటర్ కైపు వెంకట కృష్ణా రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షురాలు తుర్కపల్లి నాగ లక్ష్మీ, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి మరియు యర్రగొండపాలెం నియోజకవర్గ కోఆర్డినేటర్ పాలపర్తి విజేష్ రాజ్, కొండపి నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీపతి సతీష్, జిల్లా పార్టీ కేకేసీ సెల్ అధ్యక్షులు మన్నం ప్రసన్న రాజు, జిల్లా పార్టీ కేకేసీ అధ్యక్షులు ఉంగరాల శ్రీను, జిల్లా పార్టీ కంట్రోల్ రూమ్ చైర్మన్ బొడ్డు సతీష్, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ ఉద్దండి మల్లికార్జున, జిల్లా కిసాన్ కాంగ్రెస్ సెల్ అధ్యక్షులు కొండ్రగుంట సుబ్బారావు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు గోరంట్ల కోటేశ్వర రావు, జిల్లా పార్టీ జనరల్ సెక్రటరీ ఇరిగినేని నరసయ్య, పైనం మధు, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి పాలిటి మహేష్, జిల్లా పార్టీ బీసీ సెల్ ఉపాధ్యక్షులు ఈమని కోటేశ్వరరావు ఒంగోలు రూరల్ మండల అధ్యక్షులు తెలగతోటి బుజ్జి, మద్దిపాడు మండల పార్టీ అధ్యక్షుడు గురు బాబు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ పరువు తీస్తున్న రాజ్ విమల్**

ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఈ భూమిపూజ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు క్లాపేట వాస్తవ్యుల ముసుగులో టీడీపీ నాయకుడు రాజ్ విమల్ ఆధ్వర్యంలో విఫలయత్నం చేశారు. స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ అనుమతితో మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు టెండర్ పిలిచి అధికారకంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని టీడీపీ నాయకుడు రాజ్ విమల్ అడ్డుకొని పార్టీ పరువు, ఎమ్మెల్యే పరువు తీశారన్నారు. గతంలో రాజ్ విమల్ తండ్రి జీవి శేషు మంత్రిగా, ఎమ్మెల్యేగా, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా పని చేసి, కాంగ్రెస్ పార్టీ ద్వారా గౌరవాన్ని, ఉన్నతిని పొంది, నేడు అదే పార్టీలో కీలక నేత అయిన స్వర్గీయ రాజీవ్ గాంధీ విగ్రహ భూమి పూజను అడ్డుకునేందుకు ప్రయత్నించడం ఒంగోలు పట్టణ వాసులకు, రాజీవ్ గాంధీ అభిమానులకు, క్లాపేట వాసులకు ఆశ్చర్యాన్ని కల్గించింది. టీడీపీ నేతల ఇటువంటి చర్యల ద్వారా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌కి చెడ్డ పేరు అని పలువురు పేర్కొన్నారు.

# కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు

### డాక్యుమెంట్ల ధృవీకరణకు హాజరుకావాలి

### జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్




(షణ్ముఖ వెలుగు, , ఆగస్టు 20)

గత డిసెంబర్, జనవరి నెలలలో ప్రకాశం జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన కానిస్టేబుల్ ఉద్యోగాల ఎంపిక ప్రక్రియకు హాజరైన అభ్యర్థుల్లో సివిల్, ఏపీఎస్పీ విభాగాల్లో ఎస్సీటీలుగా తుది రాత పరీక్షలో ఎంపికైన పురుష, మహిళా అభ్యర్థులు, ఆగస్టు 22వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటలకు సంభందించిన డాక్యూమెంట్స్ తీసుకోని జిల్లా పోలీస్ కార్యాలయంలో హాజరుకావాలని జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సెలక్షన్ ప్రక్రియలో అప్పుడు అప్లికేషనుతో జతపర్చిన ధృవకరణ పత్రాలు అన్నియు ఒరిజినల్ సర్టిఫికేట్స్ తేవాలన్నారు. పై అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు గెజిటెడ్ అధికారితో అటెస్టేషను చేయించిన మూడు సెట్ల జెరాక్స్ కాపీలు కావాలన్నారు. ఇటీవల తీయించిన ఆరు పాస్పోర్టు సైజ్ కలర్ ఫోటోలతో తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. హాజరైన అభ్యర్థి అటెస్టేషన్ ఫారం నందు పూర్తి వివరాలు పొందుపరిచిన తర్వాత గెజిటెడ్ అధికారితో ధృవీకరణ చేయంచడం తప్పనసరి అని తెలిపారు.

# ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం





(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, ఆగస్టు 20)

ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా హనుమంతునిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లోని జ్వరాల నియంత్రణ చర్యలతో పాటు, లార్వా నిర్మూలన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు జ్వరాలపై అవగాహన కల్పించి, శుభ్రత పాటించడం ద్వారా డెంగీ, మలేరియా వంటి వ్యాధులను నివారించవచ్చని వైద్య అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ డి సందీప్, డాక్టర్ ఎం లక్ష్మి, బర్గవి, సూపర్‌వైజర్లు జి బాలుడు, ఎ పద్మావతి, కైగిరి డివిజన్ సూపర్వైజర్ రామనజనేయులు, జి నాగరాజు, అలాగే అశా, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు పాల్గొన్నారు.

# మహిళా సమస్యల పరిష్కారం కోసం, మద్యం ముత్తు పదార్థాలు నిర్మూలనకు ఐక్య ఉద్యమాలకు ఐద్వా మహాసభలు పిలుపు




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 20)

మహిళలు సామాజికంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం, నిత్యం అత్యాచారాలు, హత్యలు, ఆకృత్యాలు పెరగటానికి కారణమైన మద్యం మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా విశాల ఐక్య ఉద్యమాలు నిర్మించాలని ఐద్వా ప్రకాశం జిల్లా మహాసభలు నిర్ణయించాయి. బుధవారం మహాసభను ఉద్దేశించి ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్.కె మస్తాన్ బి మాట్లాడుతూ కేంద్ర నేర పరిశోధనా సంస్థ వివరాల ప్రకారం ఏడాదికేడాది నేరాలు, ఘోరాలు తీవ్ర రూపం దాలుస్తున్నాయని అన్నారు. గడచిన సంవత్సర కాలంలో 35 వేల మందిపై అఘాయిత్యాలు జరిగాయని అన్నారు. ప్రతి గంటకు 20 మందిపై అత్యాచారాలు జరుగుతున్నాయని అన్నారు. క్రైమ్ రేటు విపరీతంగా పెరగడానికి ప్రధాన కారణం మద్యం ముత్తు పదార్థాలు వెచ్చలవిడిగా దొరకటమేనని అన్నారు. అస్లీల వెబ్సైట్లు, పోర్న్ వీడియోలు ఈ దుశ్చర్యలకు పురుషులను ప్రేరేపిస్తున్నాయని అన్నారు. ఘోరాలకు పాల్పడిన దోషులపై సకాలంలో విచారణ జరిగి, శిక్షలు పడకపోవడం, రాజకీయ నాయకులు అధికారం, ధనవంతులు ప్రభావితం చేసి దోషులను రక్షిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాజంలో ఉన్న పితృ స్వామిక భావజాలం దీనికి అన్ని విధాల తోడ్పడుతుందని విచారం వ్యక్తం చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పాలకులు ఈ భావజాలాన్ని నెత్తికెత్తుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ, మనధర్మశాస్త్రాన్ని నెత్తికెత్తుకోవడం సిగ్గుచేటని అన్నారు. ఈ భావజాలానికి వ్యతిరేకంగా సమైక్య ఉద్యమాలను నిర్మించాలని అన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి కొండారెడ్డి మాట్లాడుతూ స్వాతంత్రానికి పూర్వం నుండే దేశంలో మహిళలు సమానత్వం కోసం, సాంఘిక దురాచారాల నిర్మూలన కోసం అనేక ఉద్యమాలు చేశారని అన్నారు. వారికి చదువు లేకపోయినా పట్టుబట్టి చదువు నేర్చుకుని, వాయిదాల పట్టడం చేతకాకపోయినా ప్రత్యేక శిక్షణ తీసుకొని నాటి దుర్మార్గ పాలకుల పైన సంఘవిద్ర శక్తులపైన పోరాటాలు సాగించాలని అన్నారు. ఆస్ఫూర్తిని మనం పొందాలని, ప్రజల మధ్య కులం పేరుతో మతం పేరుతో ప్రాంతీయ తత్వాల పేరుతో, బిజెపి ఆర్ఎస్ఎస్ లాంటి సంస్థలు రెచ్చగొట్టే కుట్రలను ఎదుర్కొని ముందుకు సాగాలని ఆయన అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ సోషలిస్టు వ్యవస్థలో మాత్రమే మహిళలకు సంపూర్ణ రక్షణ ఉందని అన్నారు. సంపూర్ణ అక్షరాస్యత సాధించుటలోనూ 63 శాతం మందికి ఉద్యోగాలు కల్పించడం మహిళలపై జరిగే అత్యాచారాలను వేగంగా నివారించడంలోనూ దోషులను శిక్షించడంలను నేటికీ సోషలిస్ట్ దేశాలు ముందంజలో ఉన్నాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ రంగంలో మహిళలపై కీలక పాత్రని వారి శ్రమ ద్వారానే సంపద సృష్టించబడుతుందని అన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పట్టుకొమ్మలుగా ఉన్న మహిళలకు పాలకులు ప్రాధాన్యత ఇవ్వడం లేదని నేటికీ అనగదొక్కే అసమానత్వంలోకి నెట్టేటువంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు మహిళా శ్రామికులందరినీ ఐద్వా, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కూడగట్టాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి మాట్లాడుతూ మూడేళ్ల ఉద్యమ సమీక్ష, భవిష్యత్తు కర్తవ్యాల నివేదికపై మండలాల వారీగా చర్చలు జరిపి కార్యదర్శి నివేదికను తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించుకోవడం జరిగిందని తెలిపారు. యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు జి ఉమామహేశ్వరి, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పీ కల్పన, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బండి వీరాస్వామి సంఘీభావ సందేశాలు ఇచ్చారు. ప్రజానాట్యమండలి గాయకులు సుజాత, ఏ సూరిబాబు, వి. రూబెన్, మల్లెల బాబురావు బృందం ఆలపించిన మహిళా గీతాలు ప్రేక్షకులను అలరింపజేశారు. చివరిగా ఆహ్వాన సంఘం తరఫున కేజీ మస్తాన్, మల్లెల కొండయ్య, అంగలకుర్తి బ్రహ్మయ్య మాట్లాడుతూ ఈ మహాసభల జయప్రదానికి సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

# టీ తాగి వస్తానని పత్తా లేకుండా పోయిన భర్త భర్త జాడ కోసం పోలీసులను ఆశ్రయించిన భార్య






(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 20)

టీతాగి వస్తానని ఆర్మూర్ బస్టాండ్లో వదిలేసి పత్తాలేకుండా పోయిన భర్త జాడ కోసం తెలంగాణాకు చెందిన ఓ వివాహిత బుధవారం పొదిలి పోలీసులను ఆశ్రయించింది. నగరపంచాయతీ పరిధిలోని పోతవరం గ్రామానికి చెందిన బత్తులు కార్తీక్ బేల్దారి పనుల నిమిత్తం నిజామాబాద్ జిల్లా మదాపూర్‌కు వెళ్ళారు. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన అనూషతో పరిచయం ఏర్పడింది. పరస్పరం ఒకరికొకరు ప్రేమించుకొని కుటుంబ పెద్దలను ఎదిరించి వివాహం చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే కూలి, నాలీ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆమె గర్భం దాల్చింది. ఇటీవల కార్తీక్ తమ సమీప బంధువుల వివాహ వేడుకల్లో పాల్గొనేందకు భార్యతో సహా దర్శికి వచ్చారు. అతని కుటుంబ సభ్యులు ఏదోకవిధంగా అనూషను వదిలించుకొని వస్తే మరో వివాహం జరిపిస్తామని గట్టిగా పట్టుబట్టారు. దీంతో తల్లిదండ్రుల ఒత్తిడికి తలొగ్గిన కార్తీక్ భార్యతో సహా తిరిగి తెలంగాణా రాష్ట్రానికి పయనమై వెళ్ళారు. ఆర్మూర్ బస్టాండ్‌లో భార్యకు టీ తాగి వస్తానని చెప్పి పత్తాలేకుండా పోయాడు. ఫోన్ చేసినా స్పందించకపోవడంతో ఆమె తిరిగి అత్తగారి ఊరైన పోతవరం చేరుకుంది. ఇంటికి రాగానే తాళ్ళం వేసి ఉండటంతో అవాక్కైన ఆమె అత్తా, మామలకు ఫోన్ చేసింది. రూ.10లక్షలు తేవాలని వారు ఖరాఖండిగా తేల్చి చెప్పడంతో ఏమిపాలు పోని అనూష బుధవారం పొదిలి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. భాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తామని ఎస్ఐ వేమన తెలిపారు.

# ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు మున్సిపాల్టీలు దృష్టి సారించాలి





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 20)

అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించుకుంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడంపై మున్సిపాలిటీలు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. ముఖ్యంగా పారిశుద్ధ్యము, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఒంగోలుతో పాటు జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల కమిషనర్లతో బుధవారం తన క్యాంపు కార్యాలయంలో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీల వారీగా కార్యాలయంలో ఉన్న పారిశుధ్య కార్మికుల వివరాలు, ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ, డ్రైనేజీలను శుభ్రం చేయటం, తాగునీటి సరఫరా పై ప్రధానంగా ఆమె సమీక్షించారు. పారిశుధ్య నిర్వహణపై ఐవిఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి ప్రభుత్వం అభిప్రాయాలు సేకరిస్తున్నందున పారిశుధ్య పనుల నిర్వహణలో నిర్లక్ష్యం ఉండకూడదు అని స్పష్టం చేశారు. జిల్లా కేంద్రమైన ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ ఆయా విషయాలలో ఇతర మున్సిపాలిటీలకు ఆదర్శంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ కె వెంకటేశ్వరరావును కలెక్టర్ ఆదేశించారు. డ్రైనేజీలను శుభ్రం చేయటానికి నగరంలో 15 రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని చెప్పారు. పారిశుధ్యం ప్రస్ఫుటంగా కనిపించేలా ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. అన్న క్యాంటీన్లలోనూ పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాలు కీలకమని కమిషనర్లకు చెప్పారు. వీధి కుక్కలను కట్టడి చేయటం, వాటికి వ్యాక్సిన్ వేయించడం పైనా దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ విషయంలో పశు సంవర్ధక శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్లకు చెప్పారు. జంతు ప్రేమికుల సహకారం కూడా తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్లతో పాటు పబ్లిక్ హెల్త్ అధికారులు కూడా పాల్గొన్నారు.

# మాచర్ల వాసికి డాక్టరేట్




(షణ్ముఖ తెలుగు, మాచర్ల టౌన్, ఆగస్టు 20)

మాచర్ల పట్టణానికి చెందిన వడ్డెర సంఘం నాయకులు, తెలుగుదేశం పార్టీ నాయకుడు, బండారు నాగేశ్వరరావు సతీమణి, బండారు పద్మావతికి ఉస్మానియా యూనివర్సిటీ నుండి డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. హైదరాబాద్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించిన 84వ స్నాతకోత్సవంలో యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కుమార్, తెలంగాణ రాష్ట్ర గవర్నర్, చాన్సలర్ జిశుదేవ్ వర్మ, ఇస్రో చైర్మన్ నారాయణ్ సమక్షంలో డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. యూనివర్సిటీ మాజీ ఎడ్యుకేషన్ డీన్ సీనియర్ ప్రొఫెసర్ వెంకట్‌రెడ్డి పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు గాను ఈ డాక్టరేట్‌ని ప్రధానం చేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, స్నేహితులు, బండారు పద్మావతిని అభినందించారు.

# దీప్తి రెడ్డిని అభినందించిన ఎంపీపీ వాకా వెంకటరెడ్డి



(షణ్ముఖ వెలుగు, మర్రిపూడి, ఆగస్టు 20)

ఇష్టంతో కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు సాధించవచ్చుని ఎంపీపీ వాకా వెంకటరెడ్డి అన్నారు. మర్రిపూడి కి చెందిన ఇనుకొల్లు దీప్తి రెడ్డి నీట్ పీజీ పరీక్ష ఫలితాల్లో రాష్ట్ర స్థాయి 161 ఉత్తమ ర్యాంకు సాధించినందుకు అభినందన కార్యక్రమం బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఏ వృత్తిలోనైనా ఇష్టంతో పనిచేస్తే గుర్తింపు లభిస్తుంది అన్నారు. గ్రామస్థాయి పాఠశాలలో కష్టపడి చదివి నీట్ పీజీ లో అత్యుత్తమ ర్యాంకు సాధించిన దీప్తి రెడ్డిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని తల్లిదండ్రులకు, గ్రామానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. ఈ అభినందన కార్యక్రమంలో తహసిల్దార్ బీ. జనార్ధన్ ఇంచార్జ్‌ఎంపీడీవో షేక్ ఖాసింపిరా, ఎస్సై టి. రమేష్ బాబు, డిప్యూటీ ఎంపీడీవో నాగూర్ వలి, ఎంఈఓ ఉయ్యాల శ్రీనివాసులు, ఏపీఓ రాంబాబు, హౌసింగ్ ఏఈ భూపతి, తూగుట్ల లక్ష్మీనరసారెడ్డి, ఇనుకొల్లు మాదిరెడ్డి, సయ్యద్ షకూర్ పాల్గొన్నారు.

# వినాయకచవితికి సిద్ధమైన గణనాథుని విగ్రహాలు

## 26, 27 తేదీల్లో వినాయక చవితికి గణనాథుల ముస్తాబు





**(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, ఆగస్టు 20)**
కొండేపిలో వినాయక చవితి సందర్భంగా పలు ఆకృతిలో వివిధ అలంకరణ రూపాలలో చిన్నచిన్న పెద్ద పెద్ద గణపయ్య బొమ్మలు అమ్మకాని సిద్ధం చేసిన చేతి వృత్తి కళాకారులు. గత పది సంవత్సరాలు నుండి రాజస్థాన్‌కు చెందిన చేతి వృత్తి కళాకారులు కొండేపిలో వినాయకుని బొమ్మలు తయారు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ సంవత్సరం వివిధ ఆకారాలలో వెయ్యి రూపాయల నుండి 30 వేల రూపాయల వరకు అడుగు బొమ్మ నుండి 20 అడుగుల బొమ్మ వరకు 300 రకాల బొమ్మలు సిద్ధంగా ఉంచినట్లు చేతివృత్తి కళాకారుడు గంగారం తెలిపారు. ఈ సంవత్సరం ముడి సరుకులు బాగా పెరిగిపోవడంతో బొమ్మలు తయారీకి ఖర్చు ఎక్కువైందని గంగాధర్ తెలిపారు. ఈ సంవత్సరం వివిధ రకాల ఆకృతిలో గణనాథులు తయారు చేసినట్లు గంగాధర్ కుటుంబ సభ్యులు తెలిపారు.







## గోవా మద్యం అమ్మకాలపై దాడులు

### 35 గోవా మద్యం బాటిళ్లు సీజ్

ఒక వ్యక్తి అరెస్టు



**(షణ్ముఖ వెలుగు, కంభం, ఆగస్టు 20)**
కంభం మండల కేంద్రమైన గ్రామంలో నెహ్రూ నగర్‌లో గోవా మద్యం అమ్మకాలపై కంభం ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్, సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పోతురాజుటూరు గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి 35 గోవా ఫుల్ (750 ఎంఎల్) మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ కొండారెడ్డి మాట్లాడుతూ ఎవరైనా ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యం సీసాలు అమ్మిన,బెల్ట్ షాపులు నిర్వహించినా, అక్రమంగా మద్యం తరలించినా, అక్రమంగా మద్యం కలిగి ఉన్నా, అమ్మినా ప్రొహిబిషన్, ఎక్సైజ్ వారికి వెంటనే సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయన్నారు.

## 58 మందికి రూ.1.74 కోట్ల సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందించిన ఎమ్మెల్యే దామచర్ల





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 20)**
ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని 58 మందికి కోటి 74 లక్షల 49 వేల 12 రూపాయల సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు అందజేశారు. ఒంగోలులోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం లబ్ధిదారులకు అందించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఇప్పటి వరకు 298 మందికి 4 కోట్ల 73 లక్షల 26 వేల 129 రూపాయల సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు అందించారు. ఇదిలా ఉండగా తమకు సకాలంలో సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను వచ్చేలా చూసిన ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. నువ్వు చల్లంగా ఉండాలంటూ వారు దామచర్లను దీవించారు. ఈ కార్యక్రమంలో టీడీపి నాయకులు, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## మానికనూతల సుబ్బయ్యకి ఆర్థిక సాయం



**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఆగస్టు 20)**
కందుకూరు మున్సిపాలిటీ, గోకరాజు వారి వీధిలో నివసిస్తున్న మానికనూతల నాగేశ్వరరావుకి పక్షవాతంతో బాధపడుతూ కూలి పనులు చేసుకోలేని పరిస్థితిలో ఉన్నందున వారి ఇంటి దగ్గర ఉండి వారి కుమారుడు తల్లి, తండ్రుల ఆరోగ్యం చూసుకుంటున్నందున ఆదాయ వనరులు లేక ఇబ్బంది పడుతున్నానని వారి కుమారుడు మానికనూతల సుబ్బారావు ప్రకాశం జిల్లా కాపు సంఘం కార్యాలయానికి తెలియజేశారు. ప్రకాశం జిల్లా కాపు సంఘం అధ్యక్షుడు కొక్కిరాల సంజీవకుమార్ ఆధ్వర్యంలో బుధవారం కందుకూరులోని వారి ఇంటికి వెళ్ళి వారి కుటుంబాన్ని పరామర్శించి, ఆరోగ్య పరిస్థితి చూసి, వివరాలు అడిగి తెలుసుకొని, దగ్గరుండి జాగ్రత్తగా చూసుకోవాలని వారి కుమారునికి తెలియజేసి, వారికి కాపు సంఘం తరపున బియ్యం బస్తా, కాపు సంఘం ఉపాధ్యక్షుడు దాత నరహరి సాంబయ్య చేతుల మీదుగా అనారోగ్యంతో ఉన్న వారికి రూ.5,000 ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శి వుమ్మిడిశెట్టి శ్రీనివాసరావు, కార్యదర్శి తోట శ్రీహరి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## విశ్వజనని సేవారత్న అవార్డు అందుకున్న ఓరుగంటి చెన్నకేశవరావు



**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, ఆగస్టు 20)**
విశ్వజనని మూడవ వార్షికోత్సవ వేడుకలు హైదరాబాదులోని పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో డాక్టర్ నందమూరి తారకరామారావు కళామందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు రాష్ట్రాల నలుమూలల నుండి వివిధ రకాల అవార్డులు విశ్వజనని ఫౌండేషన్ ఫౌండర్ , చైర్మన్ బొగ్గారపు బ్రహ్మానందం వివిధ రంగాలలో స్వచ్ఛందంగా పని చేసే వాళ్లను గుర్తించి అవార్డులు ప్రధానం చేసినారు. దానిలో భాగంగా వాసవి క్లబ్ జోన్ చైర్మన్ , సీనియర్ జర్నలిస్ట్ సేవలనుగుర్తించి విశ్వజనని సేవారత్న అవార్డు సినీ నటులు అశోక్ కుమార్, సినీ, టీవి నటులు రాగిణి, బాలాజీ, జబర్దస్త్ నటులు అప్పారావు చేతులమీదుగా అందజేశారు. అనంతరం ఓరుగంటి చెన్నకేశవరావు మాట్లాడుతూ సమాజంలో సేవలు చేసే వారిని గుర్తించి వారికి అవార్డు రూపంలో ప్రోత్సహించడం వారి సేవను మరింత ముందుకు తీసుకెళ్లే విధంగా ప్రోత్సహిస్తున్నారని, మాపై మరింత బాధ్యతను పెంచుతున్నారని బ్రహ్మానందం కి కృతజ్ఞతలు తెలిపారు. అవార్డు గ్రహీత ఓరుగంటి చెన్నకేశవరావు కు పలువురు నాయకులు, పలు స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు అభినందనలు తెలిపారు.

## యేలూరు, టీ సల్లూరు గ్రామాల్లో పొలం పిలుస్తుంది

**(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 20)**
మండలంలోని యేలూరు, టీ సల్లూరు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అలాగే ప్రస్తుతం ఖరీఫ్ సీజన్2025లో వేసినటువంటి పంటలకు తప్పనిసరిగా అందరూ రైతులు క్రాప్ ఇన్సూరెన్సు నమోదు చేయించు కోవాలని , క్రాప్ ఇన్సూరెన్స్ కి సంబంధించిన గడువును జూలై 31 నుండి ఆగష్టు 31 వ తేదీ వరకు పొడిగించారు. రైతు వాటాగా కందికి పంటకి ఎకరాకి రూ.430, సజ్జ రూ.156, వరి పంటకు రూ.860, మిరప పంట రూ.4,500 చెల్లించి కామన్ సర్వీస్ సెంటర్స్ నందు నమోదు చేయించు కోవాలని మండల వ్యవసాయ అధికారి తెలియజేశారు. ఖరీఫ్ 2025లో సాగు చేస్తున్న ప్రతి పంటను ఈ పంట నమోదు ప్రక్రియ లోనికి తీసుకొని రావాలి వ్యవసాయ, ఉద్యాన ,పట్టు పరిశ్రమ చెందిన పంటలు సామాజిక వనాలు సోషల్ ఫారెస్ట్ అయిన ఈ పంట నమోదు తప్పనిసరి అని ప్రభుత్వం కల్పించే వ్యవసాయ పథకాలు రాయితీలకు ఈ పంట నమోదు ప్రామాణికమని దీని వలన రైతులకు ఉప యోగాలు ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి దేవి రెడ్డి శ్రీనివాసులు గారు తెలిపారు. యేలూరు, మరియు టీ సల్లూరు, రైతు సేవా కేంద్రాల పరిధిలో రైతులతో ఏవో గారు మాట్లాడ్డం జరిగింది. ఈ పంట నమోదుకు యజమాని రైతులు వాళ్ళ పొలాన్ని కౌలుకు ఇచ్చినటలయితే కౌలు రైతుల కు సహకరించాలని వారి పొలాలను తప్పనిసరిగా ఈ పంట నందు నమోదు చేయవలసిన పని ఉందని అని పొదిలి మండల వ్యవసాయ అధికారి గారు తెలపడం జరిగింది. కంది పంట లో కలుపు విషయం లో తీసుకోవాల్సిన సమగ్ర పంట యాజమాన్య పద్ధతులను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, ఆ గ్రామ రైతులు పాల్గొన్నారు.







# యువత బంగారు భవిష్యత్తుకు భద్రతతో కూడిన ఉద్యోగాలు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం



సీఎం అపార అనుభవం, దూర దృష్టితో రాష్ట్రంలో భారీగా పెట్టుబడితో పరిశ్రమలు
పరిశ్రమలకు భూములు ఇచ్చిన రైతులకు
నియోజకవర్గ ప్రజలు ఎల్లప్పుడూ రుణపడి ఉంటారు
ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు
పోర్టు ఆధారిత పరిశ్రమల రాకతో
రామాయపట్నం పరిసర ప్రాంతాల రూపురేఖలు మారబోతున్నాయి
జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్














**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఆగష్టు 20)**

బుధవారం ఉదయం గుడ్లూరు మండలం చేవూరు గ్రామంలో ఇండోసోల్ సోలార్ పరిశ్రమలో భూములు కోల్పోయిన కుటుంబాలకు , స్థానిక యువతకు 73 మందికి ఉద్యోగ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ ఆనంద్, సబ్ కలెక్టర్ హిమవంశి, ఇండోసోల్ సి.ఓ బాలచందర్ కృష్ణన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ 2047 స్వర్ణాంధ్ర సాధన లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిర్దిష్టమైన ప్రణాళికతో ముందుకు సాగుతున్నారన్నారు. యువ నాయకులు రాష్ట్ర మంత్రి నారా లోకేష్ బాబు పాదయాత్ర సమయంలో ఇక్కడ ప్రజలు పనులు చేసుకోలేక దూర ప్రాంతాలకు వలసలు వెళ్లిపోతున్న విషయాన్ని గమనించి ఈ ప్రాంత ప్రజల కష్టాలు స్వయంగా గమనించి ప్రకాశం జిల్లాను పారిశ్రామిక హక్కుగా మారుస్తానని ఆనాడే హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు సారధ్యంలో కందుకూరు నియోజకవర్గం సమూలంగా మారిపోబోతున్నాయని, అత్యంత త్వరలో రాష్ట్రంలోని అన్ని పోర్టల్ లాగానే రామాయపట్నం పోర్టు ప్రాంతం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. త్వరలో కందుకూరును ప్రకాశం జిల్లాలో చేసేందుకు సీఎం హామీ ఇచ్చారని తెలిపారు. వేలకోట్లతో చేవూరులో ఇండోసోల్ కంపెనీ పెట్టిన ప్రతినిధులకు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపి ఈ కంపెనీ ఏర్పాటుకు భూములు ఇచ్చిన రైతులకు ఈ నియోజకవర్గ ప్రజలు జీవితాంతం రుణపడి ఉంటారని తెలియజేశారు. స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో యువతకు శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు పెద్ద ఎత్తున ఈ కంపెనీలో కల్పించేందుకు చర్యలు చేపట్టామని పరిశ్రమలు రావడం సంతోషదాయకమని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ రామాయపట్నం పోర్టు ఆధారిత పరిశ్రమలకు భూములిచ్చిన రైతు కుటుంబాల్లోని యువతీ యువకులకు పరిశ్రమల్లో ఉద్యోగాలు కల్పించి వారికి తోడుగా ఉన్నామని చెప్పడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశంగా చెప్పారు. గ్రామాల్లోని నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఇండోసోల్, బిపిసిఎల్ కంపెనీల ఏర్పాటుతో పెద్దఎత్తున స్థానికులకు ఉద్యోగాలు లభిస్తాయన్నారు. ప్రస్తుతం ఇండోసోల్ కంపెనీలో స్థానికులకు 73 మందికి ఉద్యోగాలు కల్పిస్తున్నారని, ప్రతినెలా కూడా యువతకు శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించేలా కంపెనీ ప్రతినిధులతో మాట్లాడినట్లు చెప్పారు. కేవలం భూములు తీసుకున్న కుటుంబాల వారే కాకుండా ఇతరులకు కూడా వారి అర్హత మేరకు శిక్షణ ఇచ్చి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. ఉద్యోగాలు పొందిన వారందరూ కూడా తమ గ్రామాల్లోని మిగిలిన యువతకు అవగాహన కల్పించి వారంతా కూడా శిక్షణ పొంది ఉద్యోగాలకు వచ్చేలా ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. భూములు ఇచ్చిన కుటుంబాలకు ప్రభుత్వం తరపున ఎప్పుడూ తామంతా అండగా నిలుస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. కందుకూరు సబ్ కలెక్టర్ హిమవంశి మాట్లాడుతూ ఏ దేశంలో చూసినా పోర్టు ఆధారిత పరిశ్రమలు ఉన్నచోటే అభివృద్ధి జరిగిందని చెప్పారు. మనదేశంలో కూడా ముంబయి, చెన్నై వంటి మహానగరాల అభివృద్ధికి ప్రధాన కారణం అక్కడ ఉన్న పోర్టులేనని చెప్పారు. మన ప్రాంతం కూడా భవిష్యత్‌లో మంచి అభివృద్ధి సాధిస్తుందని చెప్పారు. మన కుటుంబానికి, మన ఊరికి దగ్గరగా వుంటూ పనిచేసే గొప్ప అవకాశాన్ని స్థానిక యువత సద్వినియోగం చేసుకోవాలని సబ్ కలెక్టర్ పిలుపునిచ్చారు.

అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలి

స్థానిక యువతీ, యువకులు ఉద్యోగాల కోసం తమ దరఖాస్తులను కంపెనీ కార్యాలయంలో గానీ, కంపెనీ ఈమెయిల్‌కు గానీ పంపాలని కంపెనీ హెచ్ఆర్ ప్రతినిధులు సూచించారు. అభ్యర్థుల అర్హతల మేరకు కార్పొరేషన్ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పిస్తామని వారు ఈ సందర్భంగా చెప్పారు. సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి శిక్షణ కార్యక్రమాలు ప్రారంభించనున్నట్లు వారు తెలిపారు. ప్రతిరోజు కూడా నాలుగు గంటలు వృత్తి నైపుణ్యం పై శిక్షణ ఇస్తామని తెలిపారు.. మీటింగ్ అనంతరం కంపెనీ కార్పొరేట్ ప్రొఫైల్ ను కలెక్టర్, ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం అతిథుల చేతుల మీదుగా చేవూరు, రావూరు, కరేడు, ఏలూరుపాడు గ్రామాల చెందిన 73 మందికి ఉద్యోగ నియామాక పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఇండోసోల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కె బాలచందర్ కృష్ణన్, బైరెడ్డి రంగారెడ్డి, జిల్లా స్కిల్ డెవలప్‌మెంటు అధికారి అబ్దుల్ ఖయ్యూం, కంపెనీ వివిధ భాగాల ప్రతినిధులు, మండలస్థాయి అధికారులు, స్థానిక గ్రామాల యువతీ, యువకులు, రైతులు పాల్గొన్నారు.

## గణేష్ మండపాలకు అనుమతి తప్పనిసరి

ప్రశాంతమైన వాతావరణంలో వినాయక చవితి జరుపుకోండి
సీఐ సోమశేఖర్ పిలుపు
పోలీస్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు
సిఐ సోమశేఖర్, కొండపి ఎస్ఐ ప్రేమ్ కుమార్







**(షణ్ముఖ వెలుగు, కొండపి, ఆగష్టు 20)**

గ్రామాలు, మండల హెడ్ క్వాటర్ లో చిన్నాపెద్దా తేడా లేకుండా వినాయక చవితి ఎప్పుడెప్పుడు వస్తుందా? అని ఎదురుచూస్తున్న గణేశ్‌పండుగకు సమయం ఆసన్నమైంది. ఈ నెల సెప్టెంబర్ 27న వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ప్రారంభమైన నాటి నుంచి 3వ రోజు, 5వ రోజు, 9వ రోజు, 11వ రోజు ఇలా ఊరేగింపు, నిమజ్జనం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అలాగే సెప్టెంబర్ 27నుంచి మహా నిమజ్జన కార్యక్రమాలు ఉంటాయి. ఈ నేపథ్యంలో వినాయకచవితి ఉత్సవాల నిర్వహణకు కొండపి సిఐ సోమశేఖర్, ఎస్ఐ ప్రేమ్ కుమార్‌లు మార్గదర్శకాలను జారీచేశారు. పోలీసులు విడుదల చేసిన మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ తప్పక పాటించాలన్నారు.

## ఐటీఐలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగష్టు 20)**

2025-26 వ సంవత్సరానికి ప్రకాశం జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు ఐటిఐలలో మూడవ విడత ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చునని ప్రకాశంజిల్లా కన్వీనర్ , ప్రభుత్వ బాలురు ఐటిఐ ప్రధానాచార్యులు సి.హెచ్.యస్.వి.ప్రసాద్ బాబు నేడొక ప్రకటనలో తెలియజేశారు. అర్హులైన అభ్యర్థులు ఐటీఐ.ఏపీ.జీవోవి.ఇన్ అను వెబ్సైట్ ద్వారా తమ దరఖాస్తులను తేది. 26-08-2025 లోపు నమోదు చేసుకోవాలన్నారు.నమోదుకు సంబంధించిన పత్రాలను ప్రింట్ తీసుకోవాలని, జిల్లాలోని ఒకటి కంటే ఎక్కువ ఐ.టి.ఐ.లను కూడా ఎంపిక చేసుకోవచ్చునని తెలిపారు. ముఖ్యముగా దరఖాస్తు చేసిన వారు దరఖాస్తు ప్రింటు కాపీని, ఒరిజినల్ సర్టిఫికేట్లను తీసుకొని ఖచ్చితంగా తేది. 27-08-2025 లోగా వెరిఫికేషన్ చేయించుకొనవలసినదిగా తెలిపారు. ప్రభుత్వ ఐటిఐల యందు తేది. 29-08-2025 న, అలాగే ప్రైవేట్ ఐటిఐల యందు తేది. 30-08-2025 న ప్రవేశము కొరకు దరఖాస్తు చేసిన ఐటిఐలలో హాజరుకావాలన్నారు. పూర్తి వివరములకు చరవాణి నంబరు 9492277552 ను కార్యాలయ పనివేళలలో సంప్రదించాలని కోరారు.

## పెండింగ్ హామీల అమలు కోరుతూ ఎల్ఐసి ఏజెంట్ల ధర్నా




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగష్టు 20)**

ఎల్ఐసి యాజమాన్యం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ ఎల్ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా అఖిల భారత కమిటి ఇచ్చిన పిలుపులో భాగంగా ఒంగోలు ఎల్ఐసి కార్యాలయం వద్ద ధర్నా కార్యాలయం నిర్వహించారు. సందర్భంగా యూనియన్ ఒంగోలు బ్రాంచి అధ్యక్షులు యం.తిరుపతి నాయుడు మాట్లాడుతూ గత సంవత్సరం అక్టోబర్ నెలలో ఎల్ఐసి ఉన్నతాధికారులకు, యూనియన్ నాయకులకు మధ్య సెంట్రల్ ఆఫీస్ నందు జరిగిన చర్చల సందర్భంగా ఇచ్చిన హామీలు అనేకం పెండింగ్‌లో వున్నాయని అన్నారు. గ్రూప్ ఇన్సూరెన్స్ వయోపరిమితిని 69 సంవత్సరాలు నుండి 85 సంవత్సరాలకు పెంచుతామని, గ్రూప్ ఇన్సూరెన్స్ పరిమితిని ఏజెంట్లకు, క్లియా ఏజెంట్లకు పెంచి అమలు చేస్తామని, క్లబ్ తో సంబంధం లేకుండా ఎల్ఐసి ఏజెంట్లు అందరికీ రెండు లక్షల మెడిక్లెయిమ్ సదుపాయాన్ని కల్పిస్తామని, ఎల్ఐసి ఏజెంట్లకు పెన్షన్ తో పాటు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారని అన్నారు. కనీ వాటిని అమలు చేసేందుకు ఇంతవరకు చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా ఎల్ఐసి పాలసీలపై జిఎస్టి ని పూర్తిగా రద్దు చేయాలని, ఎల్ఐసి ని బలహీనం చేసే నిర్ణయాలను విరమించుకోవాలని, ప్రొఫెషనల్ టాక్స్ పాత బకాయిలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎల్ఐసి ఉద్యోగుల తరపున ఐసియయు బ్రాంచి అధ్యక్ష, కార్యదర్శులు పి.శ్రీనివాసరావు, కేశవరావు ధర్నాకు సంఘీభావం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు బి.వెంకట్రావు, సి.హెచ్.వి.సుబ్బారెడ్డి, పి.ఆంజనేయులు, కె.వెంకటేశ్వర్లు, ఆర్.శ్రీనివాసరావు, డి.పురుషోత్తం, బి.కృష్ణమూర్తి, సిహెచ్.నరసింహారావు, బి.మురళి, కాశీశ్వరమ్మ, శేషమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ దోమల దినోత్సవం



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగష్టు 20)**

పొదిలి అర్బన్ పిహెచ్సి మెడికల్ ఆఫీసర్ శరత్ చంద్ర ఆధ్వర్యంలో గవర్నమెంట్ బాయ్స్ హై స్కూల్ నందు ప్రపంచ దోమల దినోత్సవం ప్రతిజ్ఞ జరిపాము దోమల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ముఖ్యంగా మూడు అంశాలు వివరించాము అవి ఏమనగా నివారణకు ఉద్యమం దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకై ఉమ్మడి భాగస్వామ్యంతో ఉద్యమిద్దాం . వారం పైబడిన నీటి నిల్వలు తొలగిద్దాం . దోమలు పెరుగుదల నివారిద్దాం. దోమతెరలు వాడుదాం కాలువల్లో దోమల మందు పిచికారి చేద్దాం దోమల ద్వారా వచ్చే వ్యాధులను అరికడదాం నివారిద్దాం. దోమతెరలు వాడుదాం కాలువల్లో దోమల మందు పిచికారి చేద్దాం దోమల ద్వారా వచ్చే వ్యాధులను అరికడదాం ప్రపంచ దోమల దినోత్సవం ప్రతిజ్ఞ. ప్రపంచ తో ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా నేను నా కుటుంబం నా సమాజం ఆరోగ్య రక్షణ కోసం దోమల నివారణ చర్యలు క్రమం తప్పకుండా పాటిస్తానని నా ఇల్లు పరిసరాల శుభ్రంగా ఉంచుతానని దోమల వృద్ధి చెందే ప్రదేశాలను పూర్తిగా తొలగిస్తానని ప్రతి శుక్రవారం తప్పనిసరిగా ఫ్రైడే పాటిస్తానని మలేరియా డెంగు చికెన్ గునియా మొదటి వాపు ఫైలేరియా ఒంటివ్యాధులపై జాగ్రత్తలు తీసుకొని ఇతరులకు కూడా అవగాహన కల్పిస్తానని స్వచ్ఛత ఆరోగ్యం భద్రత అనే సంకల్పంతో దోమలు లేని గ్రామం దోమలు లేని నగరం నిర్మాణం కోసం కృషి చేస్తానని ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడంలో నా వంతు పాత్ర పోషిస్తారని ప్రజాభిన్నతికి ఎనలేని ఆరోగ్య సేవలు అందించగలన వాడనని త్రికరణశుద్ధిగా ప్రతిజ్ఞ చేస్తున్నాను.దోమలు వృద్ధి చెందే ప్రదేశాలను సమూలంగా నిర్మించండి ఆరోగ్యవంతమైన సమాజానికి శ్రీకారం చుట్టండి. మన ఊరు మన ఆరోగ్యం మన బాధ్యత ఈ కార్యక్రమంలో కృష్ణయ్య, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పి కుమార్, స్కూల్ హెచ్ఎం, టీచర్స్, ఆశలు పాల్గొన్నారు.

## మెట్ట వరి సాగు పద్ధతుల పై రైతులకు శిక్షణ, క్షేత్ర ప్రదర్శన

**(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, ఆగష్టు 20)**



మండలంలోని గొల్లపల్లి గ్రామం నందు మెట్టవరి సాగు చేపట్టిన రైతులకు మండల వ్యవసాయ అధికారి పి.జోష్న దేవి శిక్షణ మరియు క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమమునకు సహాయ వ్యవసాయ సంచాలకులు మార్కాపురం బాలాజీ నాయక్, కెవికే శాస్త్రవేత్త రమేష్, వెంకటేశ్వర్‌రెడ్డి రైతులతో చర్చించారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రమేష్ మాట్లాడుతూ సాధారణ వరిసాగు కంటే మెట్టవరి సాగువలన కలుగు లాభాలను రైతులకు వివరించారు. మెట్ట వరి సాగులో దుక్కి, దమ్ము చేయటం,నారు పెంచడం, నారు పీకటం, నాట్లు వేయటం ఉండవు కాబట్టి రైతుకు ఎకరాకు 9000 నుండి 10000 వరకు ఖర్చు తగ్గుతుందన్నారు. 15 కేజీల విత్తనం ఎకరాకు సరిపోతుంది విత్తనం ఖర్చు తగ్గించుకోవచ్చు. కలుపు సమస్యను అధిగమించితే 10-20 శాతం అధిక దిగుబడులను పొందవచ్చు అని తెలియజేశారు. కూలీల కొరతను అధిగమించవచ్చున్నారు. మెట్టవరి విత్తనం వేసిన 48 గంటలలోపు పిండిమిథలిన్ (స్టాంపు, స్టాంప్ ఎక్స్ట్రా) 1 లీటరు ఎకరాకు పిచికారి చేసుకోవాలని తెలిపారు.

20, 25 రోజుల లోపు కలుపు సమస్యను నివారించుకోవడానికి క్లించర్ 300 ఎంఎల్ ఎకరాకి, రైస్ స్టార్ 250 ఎంఎల్ ఎకరాకు, నామినీ గోల 100 ఎంఎల్ ఎకరాకు పిచికారి చేసుకొని తుంగ, వెడల్పాకు, గడ్డి జాతి కలుపును నివారించుకోవచ్చు అని సూచించారు. అనంతరం శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు రైతులతో కలిసి మెట్టవారి సాగు చేసిన పొలాలను క్షేత్ర ప్రదర్శన చేశారు. గత సంవత్సరం గొల్లపల్లి గ్రామంలో 5 ఎకరాల నుండి ఈ సంవత్సరం 40 ఎకరాల వరకు మెట్టవరి సాగు చేపట్టినట్టు వీఏఏ గణేష్ తెలిపారు. భవిష్యత్తులో మిగతా రైతులు కూడా మెట్టవరి సాగుని అవలంబించి అధిక దిగుబడులను పొందాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ దేవేంద్ర గౌడ్, వీఏఏ గణేష్, గొల్లపల్లి గ్రామ రైతులు పాల్గొన్నారు.



## డీజేఆర్ ట్రస్ట్ సేవలు ఎంతో ఉపయోగం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 20)
ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు కుటుంబ సభ్యులచే నడపబడుతున్న డీజేఆర్ ట్రస్ట్ సేవలు జిజిహెచ్ లో పేషంట్లకు ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నాయని, అవసరమైన ప్రతి సందర్భంలో ట్రస్ట్ సభ్యులు చూపుతున్న చొరవ అభినందనీయమని జి జి హెచ్ సూపరెంటెండెంట్ డా మాణిక్య రావు అన్నారు. బుధవారం డీజేఆర్ ట్రస్ట్ నుంచి మారుతీ రావు అందించిన 30 వేల రూపాయల విలువైన స్ట్రెచర్లును సూపరెంటెండెంట్ డాక్టర్ మాణిక్య రావు, డిప్యూటీ సూపరెంటెండెంట్ డా కిరణ్ కుమార్ , డిప్యూటీ ఆర్ఎంవో డాక్టర్ చెంచయ్య అందుకున్నారు. ఈ సందర్భంగా గతంలో పేషంట్లకు అవసరమైన వీల్ చైర్స్ , స్ట్రెచర్లు సమకూర్చరని డా కిరణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా స్ట్రెచర్లు సమకూర్చడానికి చొరవ చూపిన మారుతీ రావును సూపరెంటెండెంట్ అభినందించారు.

## కుక్కలున్నాయ్ జాగ్రత్త
## సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద సంచరిస్తున్న కుక్కలు




(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, ఆగస్టు 20)
మార్కాపురం పట్టణంలో వీధి కుక్కల బెడద ఆందోళన కలిగిస్తోంది. ఏ వీధిలో చూసినా శునకాలు గుంపులుగా సంచరిస్తున్నాయి. దీంతో ప్రజలు ఒంటరిగా తిరగలేకపోతున్నారు. మరీ రాత్రి వేళల్లో వెళ్లాలంటేనే వణి కిపోతున్నారు. పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల, తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణం, సబ్ రిజిస్టర్ కార్యాలయం, విద్యానగర్,తదితర ప్రాంతాల్లో కుక్కలు ఎక్కువగా తిరుగుతున్నాయి. కొన్ని మనుషుల వెంట పడుతూ భయభ్రాంతులకు గురిచేస్తు న్నాయి. మున్సిపాలిటీ వారు వెంటనే వీటి కట్టడికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. వర్షాకాలం లో కుక్క కాటు వల్ల వ్యాధికి గురికాకుండా మున్సిపాలిటీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆశిస్తున్నారు.

## 22న శ్రీగిరిలో సువాసినులచే కుంకుమార్చన

### శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి వెల్లడి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 20)
శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని ఈ నెల 22 వ తేదీ ఉదయం 9 గంటలకు ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠపాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం కల్యాణ మండపంలో సువాసినులచే సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి వెల్లడించారు. ఇందుకు సంబంధించి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సామూహిక కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొనే మహిళలకు పూజకు సంబంధించిన వస్తువులతో పాటు శ్రీ వారి, అమ్మవారి రూపులను అందచేయడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 22 వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటలకు శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం కల్యాణ మండపంలో జరిగే సామూహిక సువాసినీ కుంకుమార్చన కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని కోరారు. సామూహిక కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొన దలచిన మహిళలు శ్రీగిరి దేవస్థానం కార్యాలయంలో సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

# చౌకీవాలా కాదు చోర్ వాలా మనువాదులు దేశాన్ని ఏలుతున్నారు

### ప్రకృతి సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతున్నారు
### మోదీ పాలనపై విరుచుకుపడ్డ రచయిత, సాహితీవేత్త, కవి జయరాజ్
### ఘనంగా ప్రారంభమైన ఒంగోలు కళా ఉత్సవాలు
### ఆకట్టుకుంటున్న కళారూపాలు
### ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన శ్రీకాకుళం కళాకారులు ఆశ్రయ్య






(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 20)
భారతదేశ ప్రధాని మోదీ దేశానికి చౌకి దార్ కాదని, చోర్ దార్ అని ప్రముఖ గాయకులు, రచయిత, సాహితీవేత, ప్రకృతి ప్రేమికులు జయరాజ్ పేర్కొన్నారు. ఒంగోలులోని సివియన్ రీడింగ్ రూమ్ హాలులో ఏపీ ప్రజారాజ్యమండలి ఆధ్వర్యంలో సిపిఐ రాష్ట్ర 18వ మహాసభలను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఒంగోలు కళా ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ఏపీ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు చంద్ర నాయక్ అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జయరాజ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచంలోని అన్ని దేశాలలో ధనిక వర్గం, పేద వర్గం అనేవి రెండుగా ఉన్నాయని, ఆయా దేశాలలో సమ సమాజం నిర్మించడం కమ్యూనిస్టులకు పోరాటాల మార్గము కొంతమేర అనువుగా ఉండేటన్నారు. అయితే భారతదేశంలోకి వచ్చేసరికి కమ్యూనిస్టులకు పేద ధనిక వర్గాల తో పాటుగా కులం, మతం పెద్ద అడ్డుగోడ లుగా నిలిచాయ అన్నారు. వీటిని చేదించుకుంటూ ముందుకు స్వాగతం కత్తి మీద సాము వంటిది అన్నారు. అలాంటి సమాజంలో కమ్యూనిస్టు పార్టీలు పేదలను చైతన్య పరుస్తూ, మాట రాని వాడికి గొంతుకుని, హక్కులను తెలియజేస్తూ, ప్రశ్నించడం నేర్పుతూ, చైతన్య పరుస్తూ ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. మూడు రంగుల జెండాను మనువాద పార్టీ నేడు ఎర్రకోటపై జాతీయ జెండా ఎగరవేస్తూ 10 సంవత్సరాలుగా పాలన సాగిస్తున్నాయన్నారు. పది సంవత్సరాల కాలంలో బిజెపి సాధించింది ఏమీ లేదన్నారు. గోమూత్రం తాగటం, గోపెడ అమ్మటం, గాలిని అమ్మటం, ప్రకృతిని అమ్మడం, సహజ సంపదను కొల్లగొట్టడం చేశాయని ధ్వజమెత్తారు. ప్రకృతి ప్రేమికులు కమ్యూనిస్టులు అన్నారు. అటువంటి కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఒక వైపు పార్టీగా, పోరాటాలు సాగిస్తూ, మరోవైపు ప్రజానాట్యమండలిగా ప్రజలను చైతన్య పరుస్తూ ముందుకు సాగుతూ ఉండటం అభినందనీయమన్నారు. సిపిఐ రాష్ట్ర మహాసభలు విజయవంతం కావాలని ఈ సందర్భంగా కోరారు.



ప్రారంభ ఉపన్యాసం చేసిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో కమ్యూనిస్టులకి కీలక పాత్ర అన్నారు. ప్రజల హక్కుల కోసం, కార్మిక చట్టాల కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు చేసి విజయాలు సాధించిన ఘన చరిత్ర సిపిఐ ది అన్నారు. అలాగే ప్రకాశం జిల్లాకి చెందిన ఏపీ ప్రజానాట్యమండలి కళాకారులు సినీ దర్శకులు టి కృష్ణ నటుడు మాదాల రంగారావు, మాదాల రవి, దర్శకులు బాబ్జి, గాయకులు వందేమాతరం శ్రీనివాస్, నటులు అజయ్ ఘోష్ వంటి ఎంతోమంది కళాకారులను సినీ రంగానికి అందజేసిన ఘనత ఏపీ ప్రజానాట్యమండలికి దక్కుతుందని, అన్న నల్లూరి వెంకటేశ్వర్లు దక్కుతుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. సిపిఐ రాష్ట్ర మహాసభ సందర్భంగా ఒంగోలుకు వస్తున్న కళాకారులను ప్రజలు ఆదరించాలని, వారి కళారూపాలను తిలకంచాలని, కళలలో మమేకం కావాలని పిలుపునిచ్చారు. నేడు వస్తున్న అశ్లీల, దరిద్రమైన మనువాద కళారూపాలకు ప్రత్యామ్నాయ కళారూపాలు ఏపీ ప్రజానాట్యమండలి కళాకారు ప్రదర్శించే కళారూపాలేనని ఈ సందర్భంగా పేర్కొన్నారు. 23వ తేదీ నుండి జరుగుతున్న సిపిఐ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ కళాకారులు మానవ సమాజ నిర్మాతలు అన్నారు. కార్పొరేట్ శక్తులకు, పేదలకు మధ్య జరుగుతున్న పోరాటాలలో కళాకారులది కీలకపాత్ర అన్నారు. కొందరు కళ కళ కోసం అని, కాసుల కోసం అని చెప్తుంటే ఏపీ ప్రజానాట్యమండలి కళాకారులు మాత్రం కళ సమాజంలోని మార్పు కోసం, పేదల హక్కుల గొంతుక కోసం అని పేర్కొంటుందని తెలిపారు. ఒంగోలు కళా ఉత్సవాలను జయప్రదం చేయాలని ఈ సందర్భంగా కోరారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు నల్లూరు వెంకటేశ్వర్లు




మాట్లాడుతూ కళ కళ కోసం కాదు ప్రజల కోసం అని చాటి చెప్పింది భారత కమ్యూనిస్టు పార్టీ అని పేర్కొన్నారు 1943లో ఇఫ్తా పేరుతో సిపిఐ అనుబంధ సంఘ ఏర్పాటు చేశారని తెలిపారు అనంతరం 1948లో ఇస్తాను బ్యాన్ చేశారని అన్నారు మళ్లీ 1970 దశకం లో ఆంధ్రప్రదేశ్ ప్రజారాజ్యమండలి పేర్లతో ఉమ్మడి రాష్ట్రంలో ఏర్పాటుచేసి పేద బడుగు బలహీన వర్గాల ఎదుర్కొంటున్న సమస్యలపై పాట రూపంలో అనేక చైతన్య కార్యక్రమాలు శ్రీకారం చుట్టిందన్నారు. ఈనెల 23 24 25 తేదీలలో ఒంగోలు జరిగే రాష్ట్ర మహాసభ జయప్రదం కావాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా ప్రజారాజ్యమండలి కళాకారులు చేయడం మూడు రోజులు పాటు ఒంగోలులోని సివిఎన్ రేటింగ్ రూమ్ లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమన్నారు

**ఆకట్టుకున్న కళారూపాలు**

ఈ సందర్భంగా ఏపీ ప్రజానాట్యమండలి కళాకారులు ప్రదర్శించిన కళారూపాలు ఆకట్టుకున్నాయి. ఏపీ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు చంద్ర నాయక్, చిన్నం పెంచలయ్య, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఆర్ రామకృష్ణ, కోశాధికారి శామ్యూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆట, పాట, మాట ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. శ్రీకాకుళం జిల్లాకు చెందిన జముకుల వాయిద్యకారులు ఆశ్రియ్య ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అలాగే చిన్నారులు ప్రదర్శించిన ఎక్కడమ్మా నువ్వు లేనిది వంటి నృత్య రూపకాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. అలాగే తల్లిని మించిన దేవత, తండ్రిని మించిన దేవుడు, గగనం అంతా ఎర్రబారెను, మారిపోతుందో ఈ కాలం మారిపోతుంది, ఏమైపోతుందో మన రాజ్యాంగం, భారతదేశం భాగ్యసీమరా వంటి పాటలు ప్రేక్షకులను ఆలోచనలు రేకెత్తించాయి.

# ఉలవపాడు శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలో నూతన రథం నిర్మాణం శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి

### అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఆగస్టు 20)
మండల కేంద్రమైన ఉలవపాడు లో ప్రముఖ దేవాలయమైన శ్రీ వేణుగోపాలస్వామి వారి నూతన రథం తయారీ పూజా కార్యక్రమంలో బుధవారం ముఖ్యఅతిథిగా కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ముందుగా ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకి వేద పండితులు, ఆలయ అధికారులు, భక్తులు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికి శాలువాతో ఘనంగా సత్కరించారు. ముందుగా స్వామివారి నూతన రథం తయారీ పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని పూజలు నిర్వహించి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు.. ఆలయ అధికారులతో కలిసి నూతన రథం నమూనాను పరిశీలించారు. ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించి నియోజకవర్గం లో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసులు, ఉలవపాడు మండల పార్టీ అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు గ్రామ పార్టీ అధ్యక్షుడు చిరుతోటి గిరి పార్టీ నాయకులు అంచుపోగు వాసు, అమ్మనబ్రోలు రమేష్ ,అమ్మనబ్రోలు మాధవ పెద్దినేని కొండపనాయుడు, ఒగుబోయిన యానాది, మద్దసాని మహేంద్ర, ఎండి అబ్దుల్ కరీం, ఖాదర్ బాషా, చింతల సింగయ్య, తొట్టెంపూడి మాల్యాద్రి, దాసరి వెంకటరావు, బడితల శివప్రసాద్ పవన్ కుమార్ బాపనపల్లి సుబ్రహ్మణ్యం, సన్నిబోయిన ప్రభావతి విమలమ్మ, కారసాల శ్రీదేవి, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.







On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

# గణేష్ మండపాలకు అనుమతి తప్పనిసరి



(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం టౌన్, ఆగస్టు 20) యర్రగొండపాలెం మండల ప్రజలకు యర్రగొండపాలెం ఎస్ఐ పి చౌదయ్య ముందస్తు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

## పోలీస్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు
## యర్రగొండపాలెం ఎస్ఐ పి చౌదయ్య

గ్రామాలు, మండల హెడ్ క్వాటర్‌లో చిన్నాపెద్దా తేడా లేకుండా వినాయక చవితి ఎప్పుడెప్పుడు వస్తుందా? అని ఎదురుచూస్తున్న గణేశ్‌పండుగకు సమయం ఆసన్నమైంది. ఈ నెల ఆగష్టు 27న వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ప్రారంభమైన నాటి నుంచి 3వ రోజు, 5వ రోజు, 9వ రోజు, 11వ రోజు ఇలా ఊరేగింపు, నిమజ్జనం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అలాగే ఆగష్టు 27 నుండి మహా నిమజ్జన కార్యక్రమాలు ఉంటాయి. ఈ నేపథ్యంలో వినాయకచవితి ఉత్సవాల నిర్వహణకు యర్రగొండపాలెం పోలీసులు మార్గదర్శకాలను జారీచేశారు.

**అనుమతి తప్పనిసరి**

గణేశ్ మండపాల ఏర్పాటు మొదలు నిమజ్జనం వరకు అన్ని నిబంధనలను పాటించడంతో పాటు, ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని యర్రగొండపాలెం ఎస్సై పి చౌడయ్య స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అందరూ సహకరించాలంటూ ఎస్సై కోరారు. గణేశ్ ఉత్సవాల నిర్వహణకు సంబంధించి నిర్వాహకులు ఈ నెల 27వ తేదీ నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు మండల పోలీసుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. గణేశ్ మండపాలు ఏర్పాటు చేసేందుకు ఎంచుకున్న స్థలానికి సంబంధించిన యజమానుల నుంచి నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్‌ను తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్సై పి చౌడయ్య తెలిపారు.

వివాదాస్పద ప్రదేశాలతో పాటు యజమానులు అనుమతించకపోయినా ఆయా ప్రదేశాల్లో ఎట్టి పరిస్థితుల్లో వినాయకుడి మండపాలు ఏర్పాటు చేయకూడదని తేల్చిచెప్పారు. సెల్లార్లు, కాంప్లెక్సుల్లో నిర్వహించే ఉత్సవాలకు కూడా పోలీసుల అనుమతులు తప్పనిసరి. అలాగే మండపాలకు సంబంధించి కరెంట్ కోసం విద్యుత్‌శాఖ నుంచి తప్పని సరిగా అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. గణేశ్ మండపాల వద్ద 2 స్పీకర్ బాక్సులకు మించి వాడకూడదని ఎస్ఐ తేల్చి చెప్పారు. ముఖ్యంగా కమిటీ సభ్యులను ముందుగానే బైండోవర్ చేస్తామని ఎస్ఐ పి చౌడయ్య తెలిపారు.

## సుంకేసుల గ్రామంలో 23 మంది వికలాంగులకు నోటీసులు జారీ

**పూర్తి వైకల్యం కలిగిన 13 మందికి సదరం సర్టిఫికెట్లు రిజెక్ట్ చేసినట్లు ఆదేశాలు**



(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, ఆగస్టు 20)
మండలంలోని సుంకేసుల గ్రామంలో దాదాపు 13 మంది వికలాంగుల పెన్షన్‌లు పూర్తిగా రద్దు చేసినట్లు నోటీసులు ఇవ్వడం జరిగింది. అసలు పూర్తి వైకల్యం కలిగిన వారికి కాలు చేతులు పడిపోయిన వారి పెన్షన్ లు రద్దు చేయడం జరిగిందని కొంతమంది పెన్షన్ దారులు లబోదిబో అంటున్నారు. డాక్టర్ లు చూసి చూడనట్టు మమ్మల్ని మాకు సదరం సర్టిఫికెట్ లో 40% పైన ఉన్న కూడా మమ్మల్ని పెన్షన్ దారుల పరిగణలోకి తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేసారు. అనంతరం మాకు పెన్షన్ రాదని చెప్పడానికి ఈ నెలలో ఇంటింటికి నోటీసులు ఇచ్చారని పెన్షన్ దారులు ఇదెక్కడి న్యాయం అంటూ మమ్మల్ని పట్టించుకునే వారు లేరా అంటూ ఆందోళన చెందారు. పై ఫోటో లో ఉన్న వ్యక్తి పూర్తి వ్యకల్యం కలిగి మంచానికే పరిమితం అయినా దూదేకుల మస్తాన్ వలి (తండ్రి) పెద్ద అస్సాన్ 78% వ్యకల్యం కలిగి ఈయన గత కొంత కాలంగా ఆక్సిడెంట్ అయ్యి కొన్ని సంవత్సరాలుగా ఎన్నో రకాలుగా ఇబ్బందులు పడుతూ వచ్చిన పెన్షన్ తో కాలం గడుపుతూ జీవనం కొన సాగిస్తున్నాం.

## ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం

**ప్రీమియం చెల్లింపు గడువు పెంపు**

**ఏవో వెంకటేష్**





(షణ్ముఖ వెలుగు, మద్రిపూడి, ఆగస్టు 20)
ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పంటల భీమా పథకం గడువు ఈ నెలాఖరు వరకు పొడిగించినట్లు మండల వ్యవసాయ అధికారి వెంకటేష్ తెలిపారు. బుధవారం వ్యవసాయ అధికారి వెంకటేష్ ఆధ్వర్యంలో పన్నూరు రైతు సేవా కేంద్రం నందు పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వెంకటేష్ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకొని, పంటల భీమాకి రైతులు స్వచ్ఛందంగా ప్రీమియం చెల్లించుకోవాలని తెలియజేశారు. ప్రీమియం వివరాలు ఒక ఎకరానికి వరికి 860 రూపాయలు, కందికి 430 రూపాయలు, సజ్జకి 156 రూపాయలు, మిరపకి 4500 రూపాయలు, మినుములకి 205 రూపాయలు, నువ్వులకి 180 రూపాయలుగా రైతు ప్రీమియం చెల్లించాలని తెలియజేశారు. ప్రీమియం చెల్లించిన రైతులు పంట నాటిన తర్వాత గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా పంట నమోదు తప్పనిసరిగా చేయించాలని తెలిపారు. అనంతరం క్షేత్ర పర్యటన చేసి రైతులకు పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి కోటేశ్వరరావు, గ్రామ ఉద్యానవన సహాయకులు హర్షిణి ప్రియ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## భీమవరం గ్రామంలో పొలం పిలుస్తున్న కార్యక్రమం

**మండల వ్యవసాయ అధికారి డి విజయ్ కుమార్**



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఆగస్టు 20)
మండలంలోని భీమవరం -2 రైతు సేవా కేంద్రం నందు బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి డి.విజయ్ కుమార్ గారు మాట్లాడుతూ వ్యవసాయ శాఖ నందు ఖరీఫ్ 2025 పంట సీజన్ గాను ఈ పంట నమోదు చేయడం ప్రారంభించారని, కావునా మండలంలో రైతులందరు తమ గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ సహాయకులును సంప్రదించి తాము ఏ పంట సాగు చేస్తే ఆ పంటను నమోదు చేయించుకోవాలని సూచించారు. భీమవరం గ్రామంలో శ్రీ వెంకటేశ్వర %జుజ% గ్రూపుకు ప్రభుత్వ సబ్సిడీ ద్వారా డ్రోన్ పరికరం ఇవ్వడం జరిగింది. డ్రోన్ ద్వారా వరి, మిరప, వేరుశనగ, మామిడి ఇలా వివిధ పంటలలో స్ప్రే చేసుకోవడం ద్వారా రైతులకు ఖర్చు మరియు సమయం తగ్గుతుంది మరియు రైతు వెళ్లలేని ప్రదేశంలో డ్రోన్ తో స్ప్రే ను సులువుగా చేయవచ్చును అని తెలియజేసారు. మామిడి తోటలో గ్రామ రైతులతో కలిసి డ్రోన్ డెమో కార్యక్రమం నిర్వహించడం జరిగింది. డ్రోన్ తో స్ప్రే చేయించుకోవాలి అనుకుంటున్నా రైతులు, గ్రూపు కన్వీనర్ కె సునీల్ - 9182036842 సంప్రదించవలసిందిగా తెలియజేసారు.ఈ కార్యక్రమం లో వ్యవసాయం సహాయకులు పి. సురేష్ బాబు, జి వెంకటరావు, శ్రీను, చలపతి, సునీల్, గ్రామ రైతులు పాల్గొన్నారు.





## మార్కాపురం, పరిసర ప్రాంత మహిళలకు శుభవార్త

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, ఆగస్టు 20)



ప్రతి నెల జరిగే నాల్గో శుక్రవారం ఉచిత క్యాంపులో భాగంగా ఈ నెల 22వ తేదీ అనగా శుక్రవారం శ్రావణి హాస్పిటల్ నందు గర్భిణీ స్త్రీలకు, మహిళలకు ఉచిత మెడికల్ క్యాంపు కలదని వైద్యురాలు సిహెచ్ కనకదుర్గ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత క్యాంపు నందు ఉచిత ఓపి తో పాటు స్కానింగ్ ఉచితంగా చేయబడును. అదేవిధంగా ఫ్రీ క్యాంపులో బుక్ చేసుకున్న గర్భిణీ స్త్రీలకు ఆపరేషన్, నార్మల్ డెలివరీ కి అయ్యే ఖర్చులో 30% తగ్గించబడును. కావున మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని ఆమె కోరారు.

## డ్రగ్స్ ముప్పు నుంచి యువతను కాపాడుదాం

**జేసీ పిలుపు**

**మత్తు పదార్థాలు సరఫరా చేస్తే కఠిన చర్యలు**

(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఆగస్టు 20)
జిల్లాలో మత్తు పదార్థాల నియంత్రణ, నివారణ చర్యలపై సమన్వయం కోసం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా స్థాయి మత్తు పదార్థాల సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఇన్‌ఛార్జ్ జాయింట్ కలెక్టర్ జీ. గంగాధర్ గౌడ్ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాల ముప్పు నుంచి యువతను రక్షించడం అందరి ప్రధాన బాధ్యతగా భావించాలన్నారు. ప్రతి శాఖ ఒకే దిశలో కృషి చేస్తేనే ఫలితం వస్తుందని, పోలీసు, ఎక్సైజ్ శాఖలతో పాటు హెల్త్, ఎడ్యుకేషన్, పంచాయతీ రాజ్, సోషల్ వెల్ఫేర్ వంటి విభాగాలు కూడా చురుకుగా పనిచేయాలని సూచించారు. గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు, స్కూల్-కాలేజీల్లో జాగృతి సదస్సులు నిర్వహించాలన్నారు. మత్తు పదార్థాల వ్యాప్తిని అరికట్టడంలో సామాజిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థల పాత్ర కీలకమని ఆయన పిలుపునిచ్చారు. గుంటూరు ఇంటెలిజెన్స్ బ్యూరో అదనపు ఎస్పీ బి. ఫణిరాజు శర్మ మాట్లాడుతూ డ్రగ్స్ వ్యాప్తి యువత జీవితాలను నాశనం చేస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రైన్లు, బస్ స్టాండ్లు, పట్టణ శివారు ప్రాంతాల్లో పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని, గంజాయి తరలింపు, సరఫరాపై కఠిన నిఘా ఉంచాలని ఆయన ఆదేశించారు. ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు వచ్చే వలసలపై కూడా అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు గ్లోరియ, చంద్రశేఖర్, రామలక్ష్మి, మేజిస్టీరియల్ సూపరింటెండెంట్ మల్లికార్జునరావు, క్రైమ్ డీఎస్పీ జగదీష్ నాయక్, బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు, ఇతర అధికారులు ఎన్జీవోలు పాల్గొన్నారు.





## వినాయకుడి విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

**డీజే లకు పర్మిషన్ లేదు**

**సిఐ సుబ్బారావు**



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, ఆగస్టు 20)
మార్కాపురం సర్కిల్‌లో వినాయకుడి విగ్రహాలు ఏర్పాటు చేసుకునే ప్రజలు తప్పనిసరిగా అనుమతులు పొందాలని సీఐ పీ సుబ్బారావు తెలిపారు. మైక్ సెట్, ఎలక్ట్రిసిటీ ఉపయోగించుకునేందుకు అనుమతులు తప్పనిసరి అని అంతేకాకుండా విగ్రహం ఏర్పాటు చేసే కమిటీ మెంబర్ల పూర్తి సమాచారం ముందుగానే పోలీసులకు ఇవ్వాల్సి ఉంటుందని ఎన్ని రోజులు విగ్రహం ఏర్పాటు చేస్తారో ముందుగానే తెలియజేయాలన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ లో పూర్తి సమాచారం తెలియజేస్తూ లిఖితపూర్వకంగా అందించాలన్నారు. విగ్రహం ఏర్పాటు చేసే ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎందుకంటే ఎవరైనా ఉద్దేశపూర్వకంగా విగ్రహాన్ని ధ్వంసం చేస్తే అది గొడవలకు దారి తీసే అవకాశం ఉందని అన్నారు. అలానే రాత్రి వేళల్లో విగ్రహం ఏర్పాటు చేసిన ప్రాంతంలో తప్పనిసరిగా ఒక్కరు కాపలాగా పడుకోవాలన్నారు. ఏ గ్రామంలో విగ్రహం ఏర్పాటు చేస్తున్నారో అదే గ్రామానికి చెందిన పోలీస్ కు పూర్తి సమాచారం అందించాలన్నారు. వినాయకుడి విగ్రహం నిమజ్జనం ఎటువంటి డీజే సౌండ్స్ అనుమతి లేదు. తెలియకుండా డీ జే లు సౌండ్ బాక్సులు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని తెలిపారు.

## మై భారత్ ఆధ్వర్యంలో సద్భావన దివస్

(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, ఆగస్టు 20)
మై భారత్ ఆధ్వర్యంలో సద్భావన దివస్ దీనిని భారత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని భారతదేశంలో ప్రతి సంవత్సరం ఆగస్టు 20న జరుపుకుంటారు. తర్లుపాడు మండలం కలుజువ్వలపాడు గ్రామం జెడ్పీ హస్కూల్లో రచన డ్రాయింగ్ పోటీ నిర్వహించడం జరిగింది. గెలిచిన విజేతలకు బహుమతులు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు సత్యనారాయణ ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు ,రామారావు, అజయ్ కుమార్, మై భారత్ కోఆర్డినేటర్స్ పి వెంకట కాశయ్య, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పై అవగాహన కార్యక్రమం







(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఆగష్టు 20)
మండల కేంద్రమైన ఉలవపాడు జి.వి.ఎస్.ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆగస్టు నెల 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర' లో భాగంగా బుధవారం వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఆరోగ్య శాఖకు చెందిన హెల్త్ అసిస్టెంట్ అల్తాఫ్ , సీహెచ్‌వో నాగేష్ హాజరయ్యారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆల్తాఫ్ మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే వ్యాధులు పట్ల అవగాహన కలిగి ఉండాలని వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ, పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలని తెలియజేశారు. ముఖ్యంగా పరిసరాలలో నీరు నిలవ ఉండకుండా చూడాలని, దీనివలన దోమలు ఎక్కువగా పెరగకుండా అరికట్టవచ్చని తెలియజేశారు. ఈ కాలంలో ఎక్కువగా డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు అధికంగా వస్తాయని, ఇవన్నీ కూడా దోమల వలన వ్యాప్తి చెందుతాయి అని కాబట్టి మురుగునీరు నిలువ ఉండకుండా చూడాలని, మురుగు కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ లేదా కిరోసిన్ వంటివి చల్లడం ద్వారా దోమల పునరుత్పత్తిని అరికట్టవచ్చని తెలిపారు. అనంతరం కళాశాలలో చదువుతున్న మొదటి సంవత్సరం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# పంటపొలాల్లో చిరుతపులి సంచారం

### భయాందోళనలో కంభం మండల ప్రజలు

### పాదముద్రలు సేకరించిన ఫారెస్ట్ అధికారులు





(షణ్ముఖ వెలుగు, కంభం, ఆగష్టు 20)
కంభం మండలం నడింపల్లి -లక్ష్మి కోట మధ్యలో ఉన్న మొక్కజొన్న పొలంలో చిరుతపులి పాదముద్రలు కనిపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నడిపల్లి -లక్ష్మి కోట మధ్యలో ఔరాంగబాదుకి చెందిన ఓ రైతు ఏనుగు కొండ దగ్గర మొక్కజొన్న పంట వేసుకొని పొలంపనులు చేసుకొనే వారు. యధాప్రకారం పొలం పనులకు వెల్లగా అక్కడ పులి పాదముద్రలు చూసి వెంటనే స్థానికులకు తెలిపారు. అనంతరం స్థానికుల సహాయంతో వెంటనే ఫారెస్ట్ అధికారులకు తెలియజేయడంతో హుటాహుటిన ఫారెస్ట్ అధికారులు వచ్చి చిరుతపులి పాదముద్రలు సేకరించి చిరుతపులి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కంభం మండల ప్రజలు ఎలాగైనా చిరుత పులి జాడ కనుగొని పులిని పట్టుకోవాలని స్థానిక ప్రజలు ఫారెస్ట్ అధికారులను కోరారు. కంభం మండలంలో చిరుతపులి పాదముద్రలు కనిపించడం ఇదే తొలిసారి.

# మాయమాటలతో మైనర్ బాలికపై అత్యాచారం

## పొక్సో కేసు నమోదు

### నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 20)
కొత్తపట్నం మండలానికి చెందిన 16 ఏళ్ల మైనర్ బాలికను పెళ్లి చేసుకుంటానని మోసం చేసి, శారీరకంగా వేధించి గర్భవతిని చేసిన కేసులో నిందితుడికి ఒంగోలు పిల్లలపై లైంగిక నేరాల నిరోధక చట్టం (పోక్సో) కోర్టు 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10,000 జరిమానా విధించింది. అదే విధంగా బాధితురాలికి రూ.3 లక్షలు, పుట్టిన శిశువుకు రూ.3 లక్షలు పరిహారం అందేలా జిల్లా న్యాయ సేవా సంస్థను కోర్టు ఆదేశించింది.

**ఘటన వివరాలు ఇలా..**
కొత్తపట్నం మండలానికి చెందిన బాధిత బాలిక (16 ఏళ్లు) ఒంగోలులోని ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతోంది. ప్రతి ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి అల్లూరు గ్రామంలోని చర్చికి వెళ్ళేది. ఇదే సందర్భంలో అదే గ్రామానికి చెందిన బత్తుల చంటి అనే వ్యక్తి చర్చిలో మైకు పరికరాలు ఆరెంజ్ చేసేవాడు. అతను బాలికతో పరిచయం పెంచుకొని ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడు. 2019 జనవరిలో ఒక ఆదివారం, బాలిక తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో మాయమాటలు చెప్పి శారీరకంగా సన్నిహితమయ్యాడు. తరువాత కూడా పలుమార్లు ఇంట్లో ఎవరు లేని సమయంలో దుర్వినియోగం చేశాడు. ఈ విషయం ఎవరికైనా చెప్పితే నిన్ను, నీ తల్లిదండ్రులను చంపేస్తానని బెదిరించడంతో బాధితురాలు భయంతో నోరు మూసుకుంది. కొద్ది రోజులకే బాలిక ఆరోగ్య సమస్యలతో బాధపడడంతో తల్లిదండ్రులు ఒంగోలులోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ గర్భం వచ్చిందని డాక్టర్లు తెలియజేశారు. ఆ సమయంలో తల్లిదండ్రులు కఠినంగా ప్రశ్నించడంతో బాలిక అసలు విషయాన్ని వివరించింది. దీంతో 2019 ఆగస్టు 6న బాధితురాలు తన తల్లిదండ్రులతో కలిసి కొత్తపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్ఐ ఎం. శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు. అనంతరం ఒంగోలు డి.ఎస్.పీ. కె.వి.వి.ఎన్.వి. ప్రసాద్ దర్యాప్తు చేపట్టి, నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం చార్జ్‌షీట్‌ను కోర్టులో దాఖలు చేశారు.

**కోర్టు తీర్పు ఇలా..**
కేసు విచారణ సమయంలో పోలీసులు సాక్షులను సమయానికి హాజరుపరచగా, ప్రత్యేక ప్రజా అభియోజకుడు గొట్టిపాటి శ్రీనివాసరావు వాదనలు వినిపించారు. సరైన సాక్ష్యాధారాలు, సాక్షుల వాంగ్మూలాలతో నిందితుని నేరం రుజువవడంతో ఒంగోలు పోక్సో కోర్టు న్యాయమూర్తి కె. శైలజ 2025 ఆగస్టు 20న తీర్పు వెలువరించారు. నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.10,000 జరిమానా విధించడమే కాకుండా బాధితురాలికి, పుట్టిన శిశువుకు ఆర్థిక పరిహారం అందేలా కోర్టు ఆదేశించింది.

**ఎస్పీ అభినందనలు**
ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ మాట్లాడుతూ "పిల్లలు, మహిళలపై లైంగిక దాడులు చేసే వారు చట్టం నుంచి తప్పించుకునే అవకాశం ఉండదు. ఇటువంటి తీర్పులు భవిష్యత్తులో నేరస్థులకు గుణపాఠంగా నిలుస్తాయి" అన్నారు. జిల్లాలో మహిళలు, పిల్లలపై అఘాయిత్యాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పాఠశాలలు, కళాశాలల్లో 'మంచి స్పర్శ - చెడు స్పర్శ' గురించి అవగాహన కల్పించడం, స్వీయ రక్షణ పద్ధతులు, పోక్సో చట్టం, ఈవ్‌టీజింగ్, ప్రేమ పేరుతో మోసాలు వంటి అంశాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎస్పీ వెల్లడించారు. బాలికలు ధైర్యంగా ఉండాలని, సమస్యలు ఎదురైన వెంటనే తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. తల్లిదండ్రులు కూడా పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పిలుపునిచ్చారు.

**పోలీసుల కృషి ప్రశంసనీయం**
కేసులో నిందితుడికి శిక్ష పడటంలో కృషి చేసిన అప్పటి ఎస్ఐ, ప్రస్తుతం ఒంగోలు టు టౌన్ సీఐ మేడా శ్రీనివాసరావు, ప్రస్తుత కొత్తపట్నం ఎస్ఐ సుధాకర్, ప్రత్యేక ప్రజా అభియోజకుడు గొట్టిపాటి శ్రీనివాసరావు, కోర్టు లైజన్ ఏఎస్ఐ ఈ.వి. స్వామి, కానిస్టేబుల్ ఎం. యల్లమంద, కొత్తపట్నం కోర్టు కానిస్టేబుల్ కె. ప్రసాద్‌రావులను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# పోగొట్టుకున్న ఫోన్‌ను బాధితుడికి అప్పగించిన ఎస్ఐ నరసింహారావు

### ఎస్ఐ కి కృతజ్ఞతలు తెలిపిన బాధితుడు

(షణ్ముఖ వెలుగు, కంభం, ఆగష్టు 20)
పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ ను ఎస్ఐ బి.నరసింహారావు బాధితుడికి అప్పగించారు. వివరాల్లోకి వెళితే ప్రకాశం జిల్లా కంభం పట్టణంలో ఏప్రిల్ నెలలో షేక్ అహమ్మద్ బాషా తన మొబైల్ ఫోన్ ను పోగొట్టుకున్నాడు. ఫోన్ పోయిన వెంటనే మొబైల్ స్విచ్ఛాఫ్ కావడంతో అహమ్మద్ బాషా వెంటనే పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) వెబ్సైటులో నమోదు చేయగా పోగొట్టుకున్న ఫోన్ ఐఎంఈఐ నెంబర్‌ను ట్రాక్ చేసి పోలీసులు ఫోన్ ను బుధవారం రికవరీ చేశారు. అనంతరం ఎస్ఐ నరసింహారావు బాధితుడు అహమ్మద్ బాషా కు ఫోన్ ను అప్పగించారు. దీంతో అహమ్మద్ బాషా ఎస్ఐ నరసింహారావు కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ నరసింహారావు మాట్లాడుతూ.. ఎవరైనా వారి ఫోన్ పోగొట్టుకున్నా, దొంగతనానికి గురైనా అట్టి ఫోన్ వివరాలను సీఈఐఆర్‌లో నమోదు చేయాలని లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. దీని ద్వారా ఫోన్‌ను పొందే అవకాశం ఉంటుందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క రు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎవరికైనా మొబైల్ ఫోన్‌లు, అనుమానిత వస్తువులు, ఇతర విలువైన వస్తువులు దొరికితే సమీప పోలీస్‌స్టేసన్‌లో అప్పగించాలన్నారు. అంతే కాని అలాంటి వస్తువులను తమ దగ్గర ఉంచడం ఇతరులకు అమ్మడం కొనడం నేరమని ఎస్ఐ నరసింహారావు తెలిపారు.




# దిగ్విజయంగా రెండోసారి మండల వైసీపీ కన్వీనర్‌గా గుజ్జుల సంజీవరెడ్డి



(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 20)
తనపై ఎంతో నమ్మకంతో రెండవసారి మండల పార్టీ అధ్యక్ష పదవి వచ్చేందుకు కృషి చేసిన మార్కాపురం నియోజకవర్గ వైసీపీ ఇన్చార్జి అన్నా వెంకట రాంబాబు, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డి, నగర పంచాయతీ పట్టణ అధ్యక్షులు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకట్‌రెడ్డి, వైకాపా రాష్ట్ర కార్యదర్శి కెవి రమణారెడ్డి, తదితరులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఎరువులు, పురుగు మందులు షాపులు తనిఖీ



(షణ్ముఖ వెలుగు, కొండపి, ఆగస్టు 20)
మండల పరిధిలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను సింగరాయకొండ ఏడిఏ ఇ నిర్మలా కుమారి ఆకస్మిక తనిఖీలు చేశారు. అందులో భాగంగా గోడౌన్‌లో స్టాకుకి, రిజిస్టర్ నందు ఉన్న స్టాక్ కి ఏమైనా వ్యత్యాసాలు ఉన్నాయా లేదా డిబిటీ మిషన్ స్టాక్ రిపోర్ట్ తీసుకొని తనిఖీ చేశారు. డీలర్స్ అందరు ఎరువులు ఎంఆర్‌పి ధరలకు మాత్రమే అమ్మాలని సూచించారు. అధిక ధరలకి అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. అదే విధంగా కల్తీ ఎరువులు, విత్తనాలు అమ్మిన, లైసెన్స్ లేకుండా అనధికారికంగా అమ్మిన చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా రైతులందరు కూడా డీలర్స్ దగ్గర ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసేటప్పుడు రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మాల్యాద్రి, విస్తరణ అధికారి పి కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.





# తహసిల్దారును సన్మానించిన ఎంఈవోలు



(షణ్ముఖ వెలుగు, కంభం, ఆగష్టు 20)
ఉత్తమ సేవా పురస్కార గ్రహీత, మండల రెవెన్యూ అధికారి వి .కిరణ్ ను ఎంఈవోలు, సిఆర్పిలు, మండల విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది బుధవారం ఘనంగా సన్మానించారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ, సచివాలయ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ ఏఆర్.దామోదర్ చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కార ప్రశంసాపత్రాన్ని,అందుకున్న సందర్భంగా,ఆయన సేవలను గుర్తుచేస్తూ,అభినందించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు అబ్దుల్ సత్తార్ శ్రీనివాసులు మాట్లాడుతూ అధికారుల సేవలు వారి వ్యక్తిత్వానికి ప్రతీకలని ప్రశంసించారు. కార్యక్రమంలో సిఆర్పిలు మురళీమోహన్, రవీంద్రనాయక్, వై. శేఖర్, రామచంద్రుడు మండల సమన్వయకర్త చిన్ని పద్మావతి తదితరులు పాల్గొన్నారు.